కళాపోసకుడు బాపు

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
డిసెంబర్ 14, 2014

సెల్ఫీ 'సరదా'

• అక్కడ చిన్నారులే చీఫ్ మినిస్టర్లు • చూడచక్కని చైనా



రవితేజ

ఎన్టీఆర్

ప్రభాస్

కొత్త జోడీ అయితేనే...

టాలీవుడ్...బాలీవుడ్....ఏ వుడ్డు చూసినా... అదే హీరోలు. హీరోయిన్లే ఎప్పటికప్పుడు మారిపోతుంటారు. హీరోలు ఆ కొద్ది మందే. పైగా కథానాయకుడు ముసలివాడౌతున్నా... టీనేజీ హీరోయిన్‌తో జత కట్టేస్తుంటారు. కుర్ర హీరోయిన్ల అందాల ఆరబోత మాటున తమ వయోభారాన్ని దాచుకోవాలనుకుంటారు మరి (మేకప్ ఎటూ వుంటుందనుకోండి). ఇదే ఇప్పటి ట్రెండు. పవన్‌కళ్యాణ్ పంతొమ్మిదేళ్లలో పద్దెనిమిది సినిమాలు చేస్తే దాదాపు ప్రతి సినిమాలోను కొత్త హీరోయిన్‌నే జోడీగా ఎంచుకున్నారు. రేణూ దేశాయ్ (బద్రి, జానీ) విషయంలోనే ఈ లెక్క తప్పింది. అల్లు అర్జున్‌దీ ఇదే దారి. 'ఎవడు' ఒక్కటే మినహాయింపు. కాజల్ అగర్వాల్‌తో మరో సారి నటించాడు. అది అతిథి పాత్రే అనుకోండి. త్రిష, సమంత మాత్రమే మహేష్ బాబు సరసన రెండు సార్లు నటించారు. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్‌దీ అదే వరస. 'పెద్ద స్టార్‌తో సినిమా అంటే.... ప్రయోగాలు చేసే అవకాశం తక్కువ. కొత్త జోడీతో చిత్రానికి మినిమమ్ గ్యారంటీ వుంటుందనే అలా ఎంపిక చేస్తాం. పైగా మార్కెటింగ్ చేసుకోవడానికి కూడా చక్కటి అవకాశం వుంటుంది' అంటారు దర్శకుడు రమేష్ వర్మ. ఇక బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, (యాబైలు దాటినవారు) రవితేజ (యాబైల్లో పడుతున్న) వంటి హీరోలైతే త్రిష, సోనాల్ చౌహాన్, హన్సిక ...ను తమ హీరోయిన్లుగా ఎంచుకుంటున్నారు. వీరంతా హీరోకంటే కనీసం పదేళ్లు లేదా ఇరవయ్యేళ్లు చిన్న వాళ్లు. ఎందుకిలా...అంటే 'మన హీరోలు చాలా అరుదుగానే వయసుకు తగ్గ పాత్రలు చేస్తుంటారు. మరి కథానాయకుడు కూల్‌గా కనిపించాలంటే... కుర్ర హీరోయిన్లతో జోడీ కట్టాల్సిందే' అంటారు దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ. ◆

అల్లు అర్జున్



పవన్ కళ్యాణ్

మహేష్ బాబు

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

దత్తత దారిలో...

మాట ఒకటే. అప్పడైనా. ఇప్పడైనా. కాకపోతే అర్థాలే మారిపోతుంటాయి. కావాలంటే కో...టి ఉదాహరణలు. దత్తత అలాంటి ఒకానొక చిట్టి పొట్టి మాట.

ఎవరైనా అందుకు ఉత్సాహపడ్డారూ అంటే దాని వెనక ఎన్ని విషయాలుండేవనీ! పిల్లా పీచూ గొడ్డూ గోదా అంటారే! అందులో మొదటిదానికి నోచుకోకే ఈ తిప్పలు. అది కూడా ఆడపిల్లను కాదు. మగపిల్లాణ్ణే. వేలు విడిచిన ...కాలు విడిచిన వారైనా...బీరకాయ పీచు బంధమైనా సరే. బంధువుల సంతానానికే ప్రథమ ప్రాధాన్యత.

వారసత్వంగా వచ్చిన.. కూడబెట్టిన (ఏం చే...సైనా సరే) ... స్థిర చరాస్తులు బైటికి పోకుండానే ఈ ఏర్పాటు. పనిలో పనిగా ఇంటిపేరు కూడా తమతోపాటే ఆగిపోకుండా మరో తరానికి విస్తరిస్తుంది. పైగా పిల్లలతో ముద్దూ ముచ్చటా తీరుతుంది. ఇన్నున్నాయ్ ఆ ప్రక్రియ వెనక.

అప్పట్లో దత్తత అంటే తెల్సిందదే. ఇవాళ దత్తత అంటే పిల్లలనేనా! కుక్క పిల్లలూ, పక్షి పిల్లలూ, మొక్కలూ, జూల్లో జంతువులూ, గ్రామాలూ, రాష్ట్రాలూ, రాజధానులూ అన్నీనూ.

హాలీవుడ్ నటి ఏంజలీనా జోలీ మొదలుకొని బాలీవుడ్ నటి సుస్మితాసేన్ వరకూ ఆ దారిలో నడిచినవారే. ఇంద్రధనస్సు కుటుంబం కావాలన్నది 'జో' కోరిక. పెళ్లి కాకుండానే మాతృమూర్తిగా మధురానుభూతులను పొందాలన్నది 'సేన్' ఆశ. వారి కోర్కెలను తీర్చిన మంత్రదండం మరేదో కాదు. 'దత్తతే'. ఈ ఎపిసోడ్ మొత్తంలో ఎంత పెద్ద ప్రచారమనీ! కదిలితే కథనం. మెదిలితే వార్తా మథనం. ఇవి చాలవన్నట్టు ఫొటోలు, బ్రేకింగ్ న్యూసులూ.

సినిమావాళ్లను మించిపోయారు రాజకీయ నాయకులు. వీరు దత్తత తీసుకోరు. ఇస్తారు. తొమ్మిదేళ్ల బ్రే...క్ తర్వాత గద్దెనెక్కిన బాబుగారు రాష్ట్రాన్ని జపాన్‌కు, రాజధానిని సింగపూర్‌కు దత్తత ఇచ్చేశారు. బాగా కిందికి దిగిపోయి... గ్రామాలను సైతం దత్తత తీసుకోమని కార్పొరేట్ల కాళ్లావేళ్లా పడిపోతున్నారు. ప్రజల వద్దకు పాలన లాగా (అప్పుడు). కార్పొరేట్ల చెంతకే గ్రామాలన్నమాట (ఇప్పుడు). మన మంత్రులు, ఎమ్మెల్యేలు తక్కువా! తమ పరిధిలోని పల్లెటూళ్లను దత్తత ఇచ్చేశారు. తొలిసారిగా ప్రధాని అయిన మోడీ సాబ్ ... ఏకంగా దేశాన్నే అమెరికాకు దత్తత ఇచ్చేరు.

అవునూ...! గ్రామాలూ, రాజధానులు, రాష్ట్రాలను ... టోటల్‌గా దేశాన్నే దత్తత ఇచ్చేస్తే ... ఇక ప్రభుత్వానికి చేయడానికి ఏం మిగిలినట్టు?!

■

◆ మనలో మాట



టపా

ఆద్యంతం ఆకట్టుకుంటున్న సీరియల్

నవంబరు 30వ తేదీ ప్రజాశక్తి ఆదివారం సంచిక ఆసాంతం ఆసక్తికరంగా వుంది. 'వెలుగుజాడ' కథనం చాలా బాగుంది. మిగిలిన కవుల వివరణలు, గురజాడ రచనలలో ఉన్న గొప్పతనం ఇందులో చాటారు. మిలియన్ డాలర్ బేబీ చదివితే వైద్యం పట్ల ఎంత నిర్లక్ష్యం కనబరుస్తున్నారో అర్థమైంది. మానవతా వాదాన్ని మరిచిపోతున్నారు. ప్రాణికోటిపై ఉండే ప్రేమ, గబ్బిలాలకూ ఓ ఆసుపత్రి బాగుంది. మనసుంటే మార్గం ఉందంటారు పెద్దలు. సృజన కూడా అలాంటిదే. కళలపై ఉన్న మక్కువ బాగుంది. దేశంలో గుర్తింపు పొందిన సర్పంచులు గురించి 'ఆ అయిదుగురు' లో చదివి సంతోషించాం. చిన్నదైనా, పెద్దదైనా పదవి పదవే. పదవి ఉంటే కొంతమంది సేవ చేస్తారు. కొంతమంది దోచుకు తింటారు. మహిళలు ఓర్పుగా నేర్పుగా పని చేయడం పుట్టుకతో వచ్చిన పని. ప్రజాప్రతినిధులుగా పెద్ద పదవులను చేపట్టిన వారు ప్రజలకు సేవ చేయడం లేదు. పని చేసిన వారిని గౌరవించాలి. 'ప్రేమ విప్లవం' ధారావాహిక ఆద్యంతం బాగుంటోంది. ముక్తవరపు పార్థసారథిగారు చాలా చక్కగా తెలుగులోకి అనువాదం చేస్తున్నారు. మరిన్ని ఫొటోలతో మరింత విపులంగా అందిస్తే బాగుంటుంది.

– బి.కె.లక్ష్మి, ఆముదాలవలస.

'మిస్సింగ్' బావుంది

ఆదివారం అనుబంధంలో 'పల్లెటూరి అమ్మాయిలు' గురించి రంగుల్లో ఇవ్వడం బాగుంది. అందులో అంజలి పాత్ర చాలా బాగుంటుంది. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న వారి గురించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. చూసీచూడనట్లు ప్రవర్తిస్తున్నారు. ఈ వారం కె.ఉషారాణిగారు అందించిన 'మిస్సింగ్' కథ చాలా బాగుంది. సినిమా కబుర్లు ద్వారా బాలీవుడ్ బిగ్ ఫ్యామిలీల గురించి తెలియజేశారు. చూద్దామాలో వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్న దుబాయ్ నగరం, అక్కడి బుర్జ్ ఖలీఫా టవర్, అక్కడ ఉన్న విశేషాలు గురించి ఎస్.సుధాకర్‌గారు చక్కగా తెలియజేశారు. అట్టమీద కథ 'హాబీల హాయ్ హాయ్'లో ఫోటోలు తీయడం సంగీతం, శ్రీశ్రీ, ఆరుద్ర గారు, అనంత శ్రీరామ్‌పాటలు బాగున్నాయి. బుజ్జి మేక–పంది పిల్ల, చేతులతో కుందేలు బొమ్మ ఆకట్టుకుంది. ఆర్నాల్డ్ అబోట్ అనే 90 సంవత్సరాల వృద్ధుడిని అన్నదానం చేస్తున్నందుకు అరెస్ట్ చెయ్యడం గమనార్హం. చివరి పేజీలో కళ చిత్రాలు చాలా బాగున్నాయి. అలాగే రంగుల్లో ఇచ్చిన టోపి విశేషాలు తమాషాగా ఉన్నాయి.

– అనుపోజు సంతోషి నాగరాజు, జల్‌బాగ్ కాలనీ, విజయనగరం.

నిజంగానే వెలుగుజాడ

ఐదు పదులే జీవించినప్పటికీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గురజాడ నిజంగా వెలుగుజాడే. సమయానికి ఆయన్ని గుర్తుచేశారు. ఛందస్సులు, వ్యాకరణ బంధనాల మధ్య బందీ అయిన భాషా సంకెళ్లను తెంచి వ్యవహారిక పంథాలోకి తెచ్చిన ఘనత గురజాడది. మొదటి తెలుగు కథ 'దిద్దుబాటు', ఆయన రాసిన దేశభక్తి గీతంలో ప్రతి అక్షరం ప్రతి పదం మనల్ని తట్టి లేపుతుంది. సంస్కరణలు మాత్రమే కాదు సమాజ ప్రగతిని కాంక్షించాడు. మతాన్ని ఈసడించుకొని మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును అని ప్రభోదించాడు. ఆయన 1915లో మరణించినా ఇప్పటికీ ఎప్పటికీ మనతోనే వుంటాడు.

టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

ఈ సంచికలో....

సెల్ఫీ 'సరదా'!

కవర్‌స్టోరీ 14

ఇటీవల సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తోన్న పదం... సెల్ఫీ. అతి తక్కువ సమయంలోనే ఈ సెల్ఫీ పెద్ద న్యూస్‌గా మారిపోయింది. ఈ పదం కొత్తగా అనిపించవచ్చు కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మొత్తం చిన్నా, పెద్ద, యువత సెల్ఫీ మానియాలో మునిగి తేలుతున్నారు. తొలుత ఇది పాశ్చాత్య దేశాలలో మొదలైంది. గత ఏడాది బాలీవుడ్ నటి ప్రియాంకా చోప్రా తన సెల్ఫీని సరదాగా ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసింది. అది మొదలు మనదేశంలోని అనేకమంది సినీ, స్పోర్ట్స్, రాజకీయ, ఇతర సెలెబ్రిటీలు తమ సెల్ఫీలను పోస్ట్ చేయడం మొదలెట్టారు.

ప్రత్యేకం 3
అక్కడ చిన్నారులే చీఫ్ మినిస్టర్లు

చూద్దామా 4
చూడచక్కని చైనా

కథ 6
కల చెదిరింది

సమ్‌థింగ్ స్పెషల్ 9
అవినీతిలోనూ అగ్ర దేశమే

వింత లోకం 10

నవ్వుల్ - పువ్వుల్ 11

సినిమా కబుర్లు 12
కళా పోసకుడు బాపు

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
ఇడ్లీలు ఇలా కూడా...

బాలనేస్తాలు 22
డాల్ఫిన్ డాబులు

కొత్త పుస్తకాలు 24
కాలం మారింది

సందర్భం 8
అన్ని వైపులా మృత్యువే..

◆ ప్రత్యేకం

అక్కడ చిన్నారులే చీఫ్ మినిస్టర్లు

గ్రామ సమస్యల పరిష్కారానికి పంచాయతీలున్నాయి. అయితే పంచాయతీ సభ్యుల దృష్టికి కూడా రాని సమస్యల సంగతేంటి? పెద్దలు సైతం సమస్యలుగా గుర్తించని వాటి పరిస్థితి ఏంటి? అందుకు ఏర్పాటు చేసుకున్నవే 'బాల సభ'ల వంటి పిల్లల అసెంబ్లీలు. వీటికీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికైన చిన్నారి చీఫ్ మినిస్టర్లు తాము గమనించిన సమస్యలను పంచాయతీ ముందుంచుతారు. ఈ వినూత్న ప్రయోగానికి వేదిక కర్నాటక రాష్ట్రం.

కావ్యశ్రీకి పద్నాలుగేళ్లు. కర్నాటకలోని చిట్టెమక్కి గ్రామస్తురాలు. తొమ్మిదవ తరగతి చదువుతోంది. మామూలుగా ఇవేవీ చెప్పుకోదగ్గ విషయాలు కావు. అయితే తనే ఆ గ్రామ చీఫ్ మినిస్టర్ అంటే నమ్ముతారా? రెండేళ్ల కిందట 'బాల సభ' ఎన్నికలు జరిగాయక్కడ. ఆ సందర్భంగానే కావ్యశ్రీ బాల సభ ప్రతినిధిగా ఎన్నికైంది. పద్దెనిమిదేళ్ల లోపు చిన్నారులు సమావేశమై పెద్దలు విస్మరించిన విషయాలను చర్చిస్తారు. వాటిని పంచాయతీ దృష్టికి తీసుకెళ్లడం ముఖ్యమంత్రిగా కావ్యశ్రీ బాధ్యత.

'బాల సభ' వల్ల పిల్లలకే కాదు. పెద్దలకూ అనేక రకాలుగా సాంత్వన లభిస్తోందనుకోవాలి. వర్షాకాలం వచ్చిందంటే చాలు. చిన్నారులు స్కూలుకెళ్లడం కష్టమైపోయేది. స్కూలుకెళ్లే దారిలో కాలవ పొంగి పోర్లేది. 'ఇదంతా ఒకప్పటి సంగతి. మా వల్లే ఆ మార్పు వచ్చింది' అంటాడు పదేళ్ల రచిన్ గర్వంగా. 2012లో జరిగిన 'బాల సభ'లో రచిన్, మరికొంత మంది స్నేహితులతో కలిసి పాల్గొన్నాడు. అప్పుడే గ్రామ పంచాయతీ సభ్యుల ముందు ఒక తీర్మానం చేశారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి ఆటంకంగా తయారౌతున్న కాలువకు రెండు కల్వర్టులను నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకోవడమే కాదు సాధించారు కూడా.

బాల కార్మికులు, బాల్య వివాహాలు, బడి మానేసే పిల్లలు.. ఒకటా రెండా... చిన్నారులు ఎదుర్కొనే సమస్యలు అనేకం. వీటి గురించి ఆలోచించి...పరిష్కరించడంలో పిల్లలు కూడా పాలు పంచుకుంటే బావుంటుందని యునిసెఫ్, మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు భావించాయి. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం 2007లో ఈ ప్రయోగాన్ని ప్రారంభించింది 'బాల సభ' రూపంలో. ఇది పిల్లల అసెంబ్లీ. ఇక్కడ పిల్లలే ముఖ్యమంత్రులు, మంత్రులు. వీరు సమావేశమై ... అప్పటి వరకు పట్టించుకోని గ్రామ సమస్యలను పంచాయతి ముందు వుంచుతారు. తమకు తోచిన పరిష్కారాలు కూడా చెప్తుంటారు. మొత్తం మీద సమస్య పరిష్కారం కావడమే అందరికీ కావాలి. అయితే ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు బాల సభలను నిర్వహించడం లేదు. కొన్ని మాత్రమే ముందడుగు వేశాయి.

'బాల సభ' విజయవంతం కావడానికి కారణం చిన్నారులే. వారిలోని అమాయకత్వం, ఎటువంటి రాజకీయాలు లేకపోవడం...తమ ఇళ్లల్లోనే కాక... చుట్టుపక్కల వారు ఎదుర్కొంటున్న సమస్యలు సైతం పరిష్కారం కావాలని కోరుకునే మంచితనమే కారణం.

'కొప్ప' బ్లాక్‌లో మొత్తం 22 పంచాయతీలుంటే 180 పాఠశాలలున్నాయి. అందులో 85 స్కూళ్లు మంచి స్వతంత్రంగా మంచి నీటి సరఫరా సౌకర్యం కావాలని కోరుకుంటున్నాయి. అలాగే పారిశుధ్య సమస్యను కూడా పరిష్కరించుకోవాలని చూస్తున్నాయి. గతేడాది 560 ఇళ్లల్లో మరుగుదొడ్లు నిర్మించారు. అంతా పిల్లల పట్టుదల వల్లనే సాధ్యమైంది.

చిన్నారులు బాల సభల పట్ల బాగా ఆకర్షితులౌతున్నారు. వీరు కేవలం పంచాయతీ స్థాయిలో పరిష్కారం కాదగిన సమస్యల గురించే కాక... బ్లాక్, జిల్లా స్థాయిలో చర్చించాల్సిన అంశాలను కూడా వెలుగులోకి తెస్తున్నారు. గత ఏడాది జరిగిన 'బాల సభ' వివిధ సబ్జెక్టులకు ప్రత్యేకంగా టీచర్లు వుండాలని, ఆటలకు కూడా ఒక ఉపాధ్యాయుని ఏర్పాటు చేయాలని, అదనపు తరగతి గదులు నిర్మించాలని తీర్మానించింది. స్కూలు అధికారులు మధ్యాహ్న భోజనం నాణ్యతను తగ్గించడాన్ని కూడా కావ్యశ్రీ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లింది. మరుగుదొడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నది ఆమె డిమాండ్లలో ప్రధానమైనది.

ఉడుపి జిల్లాలోని 'హోషాంగ్రి' పంచాయత్ కూడా బాల సభను ఏర్పాటు చేసింది. ఆ గ్రామ పరిధిలో వున్న చెరువు చుట్టూ కంచె వేయడం అనేది బాల సభ సాధించిన విజయమే. స్కూలుకెళ్లాలంటే చెరువు మీదగా వెళ్లాలి. కొన్నేళ్ల కిందట ఓ పిల్లాడు జారి చెరువులో పడిపోయాడు. పిల్లల సమస్యను పెద్దవాళ్లు పెద్దగా పట్టించుకోలా. కానీ బాల సభ గుర్తించి చెరువు చుట్టూ కంచె వేయించింది.

బాల్యం నుంచే సమస్యలను గుర్తించడం...దాని గురించి మాట్లాడడం... ఏ విధంగా పరిష్కరించాలో తెలుసుకోవడం... మంచిదే! ముందు తరం నేతలు నేటి బాలలే కదా. ◆

జనంతో కిటకిటలాడిపోయే చైనా ప్రపంచంలోకెల్లా అతి పెద్ద దేశం. మన దేశంలో లాగానే చైనాలోని అధిక సంఖ్యాకులు గ్రామప్రాంతాలలోనే జీవిస్తుంటారు. వ్యవసాయమే ముఖ్యాధారం. వరి, గోధుమ, మొక్కజొన్న - వగైరా వంటలనే ఎక్కువగా పండిస్తారు. అలాంటి చైనాను సందర్శించటమంటే అయిదు వేల సంవత్సరాలకు పైగా సాంస్కృతిక చరిత్రగల ఓ మహా భూభాగాన్ని చుట్టి రావడమే.

◆ చూద్దామా

చూడచక్కని చైనా

చైనాలో నలభై వేల బౌద్ధాలయాలు, అనేక బౌద్ధారామాలు ఉన్నాయి. ఇహ బుద్ధ విగ్రహాల సంగతి సరేసరి. దేశం నిండా అసంఖ్యాకమైన బౌద్ధ ప్రతిమలు ఉన్నాయి. క్రీస్తు పూర్వం ఒకటో శతాబ్దంలో మన దేశం నుంచి ఇక్కడికి బౌద్ధ ప్రచారకులు వచ్చి బౌద్ధ మతాన్ని ప్రచారం చేశారు. ఈనాటికీ బౌద్ధ మత ప్రభావం ఇక్కడ కనిపిస్తూనే వుంటుంది.

చైనాను సందర్శించిన వారు ఎత్తుగా ఉన్నతంగా వున్న గోడను తప్పక చూడాలి. దేశంలోకి శత్రువులను చొరబడనీయకుండా, దండయాత్రల నుంచి రక్షించుకోవాలనే సంకల్పంతో చైనా చక్రవర్తులు ఈ గోడను నిర్మించినట్లు చారిత్రక కథనం. గ్రేట్‌వాల్‌ను చూడటం పర్యాటకులకో వింత అనుభూతినిస్తుంది. అలాగే లెషాన్‌లోని గ్రాండ్ బుద్ధా అని పిలవబడే బ్రహ్మాండమయిన బుద్ధ విగ్రహాన్ని, లాసాలోని పోటాలా భవనాన్ని, క్సియాన్‌లోని క్విన్ చక్రవర్తి సమాధిని ఇంకా అనేక చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతగల స్థలాలను, మ్యూజియాలను చూడకుండా ఎవరూ వెనుదిరగరు.

మూడు నదుల సంగమం

సిచుయాన్ రాష్ట్రంలో వున్న లెషాన్ చాలా అందమైన ఊరు. మిన్, క్వింగ్యు, దాదు అనే మూడు నదులు ఈ ఊళ్లోనే సంగమిస్తాయి. డాఫు అని చైనా ప్రజలు పిలుచుకునే బ్రహ్మాండమైన బుద్ధ విగ్రహం ఈ ఊళ్లోనే వుంది. ధ్యానముద్రలో కూర్చున్న భంగిమలో వున్న ఈ విగ్రహం 233 అడుగుల ఎత్తుతో చూడగానే ఆకట్టుకుంటుంది. ఈ దేవుని పాదాల మీద 50 మంది కూర్చుని బుద్ధుని



లెషాన్ బ్రిడ్జి

ధ్యానించవచ్చు. అంత పెద్దగా వుంటుందీ విగ్రహం!

కున్మింగులోని రాతి అడవులు, డాజులోని డాజు గుహలు కూడా సందర్శకులు చూడదగ్గవే. చైనా వెళ్లినవారు షాంఘయి, బీజింగ్ వగైరా పట్టణాలను చూడకుండా వచ్చే చాన్సే లేదు. ముఖ్యంగా ఆ దేశ రాజధాని బీజింగ్‌ను సందర్శించటం యాత్రికులకు ఎన్నో మరపురాని జ్ఞాపకాలను మిగులుస్తుంది.

విశాలమైన వీధులతో సమున్నత సౌధాలతో శోభిల్లే బీజింగ్‌కు కొత్తగా వచ్చినవాళ్లు ఆ నగర సౌందర్యానికి, ఆ గంభీరతకు అవాక్కయిపోతారు. సువిశాలమైన వీధులలో వచ్చేపోయే వాహనాలను, ప్రవాహంలా కదిలిపోయే జన సందోహాన్ని చూడాలే కానీ వర్ణించలేం. ఈ నగరమే కేంద్రంగా 24 మంది చక్రవర్తులు కొన్ని శతాబ్దాలపాటు సువిశాలమైన చైనా దేశాన్ని పరిపాలించారు. వారు నిర్మించిన అనేక కట్టడాలు అనాటి జ్ఞాపకాలు బీజింగ్ నగరం నిండా కనిపిస్తాయి.

చైనా వాషింగ్‌టన్

బీజింగ్‌ను చైనా వాషింగ్టన్‌గా అభివర్ణించేవారూ వున్నారు. మంగోల్ వీరుడు చంఘిజ్‌ఖాన్ తన సేనతో వచ్చి దాడి చేసింది ఈ నగరంలోనే. కుబ్లయ్‌ఖాన్ మంగోల్ వీరులతో గోబీ ఎడారి నుంచి గుర్రాల మీద ఆగమేఘాలలో రావటానికి వీలుగా అనేక వంతెనలను, కట్టడాలను, రహదారులను నిర్మించిందీ ఈ నగరంలోనే. ఈ నగరంలోనే మింగ్ చక్రవర్తులు తమ అసమర్ధ పరిపాలనవల్ల ప్రజాగ్రహాన్ని రుచి చూసి తమ పతనానికి తామే పునాదులు వేసుకొన్నారు. ఈ నగరంలోనే మంచూ చక్రవర్తులకు ప్రజలు చరమగీతం పాడారు. విప్లవ నినాదాలతో మారుమోగింది ఈ నగరమే. అరుణ పతాకాల రెపరెపలు ఆకాశాన్ని చుంబించింది కూడా ఈ నగరంలోనే. ఛెయిర్‌మెన్ మావో నేతృత్వంలో కమ్యూనిస్టు పరిపాలనకు స్వాగతం పలికింది. కూడా ఈ నగరమే. పాతకొత్తల మేలు కలయికతో బీజింగ్ విలసిల్లుతూ వుంటే మరో పక్క పాత పట్టణంలో హుటాంగ్స్ అనేబడే తేనె పట్టుల్లాంటి పాతకాలపు చైనావారి గృహాలు దర్శనమిస్తూ వుంటాయి. తియాన్‌మెన్ కూడలికి నలువైపులా విశాలంగా విస్తరించుకొని వున్న ఈ నగరంలో యాత్రికులు సందర్శించవలసిన స్థలాలు ఎన్నో వున్నాయి. గ్రేట్‌హాల్ ఆఫ్ ది పీపుల్, ఛెయిర్‌మెన్ మావో మెమోరియల్ హాల్, చైనా ఆర్ట్ గ్యాలరీ, బీహయ్ పార్క్, బీజింగ్ జూ, అయిదు పగోడాల ఆలయం, షౌదు జిమ్నాషియం వంటివెన్నో సందర్శకులను ఆకర్షిస్తూ వుంటాయి.

తినరా మైమరచి...

యాత్రికులు బస చేయటానికి బీజింగ్ హోటల్, గ్రేట్‌వాల్ హోటల్, జింగ్యు, బెలియు వంటి అధునాతన సౌకర్యాలున్న హోటళ్ళు

చైనా రెస్టారెంట్

ఎన్నో. రెస్టారెంట్లు సంగతి చెప్పనే అక్కర్లేదు.

బీజింగ్ వెళ్ళిన వాళ్ళను తప్పనిసరిగా లొట్టలేయిస్తూ ఆకర్షించేది బీజింగ్ బాతు. బొద్దుగా నిగనిగలాడుతూ వుండే ఓ రకం జాతి బాతులు ఇక్కడ మాత్రమే లభ్యమవుతూ వుంటాయి. ఈ బాతు మాంసంతో చేసే వంటకాలు విదేశీయుల్నీ స్వదేశీయుల్నీ కూడా ఒకేరకంగా ఆకర్షిస్తూ వుంటాయి. బీజింగ్ డక్‌తో 50 రకాల వంటకాలను తయారు చేస్తారు. ఈ బాతులోని ప్రతి అవయవంతోను ఒకరకమైన ప్రత్యేక వంటకాన్ని తయారు చేస్తారు. ఈ పదార్ధాలన్నీ అమిత రుచికరంగా జనాన్ని బాగా ఆకర్షిస్తూ ఉంటాయి.

బీజింగ్ రోస్ట్ డక్ రెస్టారెంటు, బిన్సిఫాంగ్ రెస్టారెంటు వగైరా రెస్టారెంట్లు ఈ బాతు వంటకాలకు పెట్టింది పేరు. నిత్యం జనంతో

మావో మెమోరియల్ హాల్

రద్దీగా ఉండే ఈ రెస్టారెంట్లలో ఓ టేబుల్ సంపాదించి తీరిగ్గా కూర్చొని బాతు మాంసపు వంటకాలను భోంచేయాలంటే తెల్లవారుఝామునే వెళ్ళి హోటల్ ముందు క్యూలో నిలబడాల్సిందే!

బీజింగ్ నగర సందర్శనాన్ని ఎవరయినా తియాన్‌మెన్ కూడలి దగ్గరే కాలక్షేపానికి చైనీయులు ఎక్కువ సంఖ్యలో గుమికూడుతూ వుంటారు. వసంతకాలంలో చైనా యువకులు ఇక్కడే చేరి గాలిపటాలు ఎగరేస్తూ ఉంటారు. ఆ సమయంలో రకరకాల రంగురంగుల గాలిపటాలతో బీజింగ్ గగనతలం కిక్కిరిసిపోతుంది. ఇహ అరుణ పతాకాల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆకాశం ఎర్రబడిందా అన్న భ్రమను కలిగించేటన్ని ఎర్రజెండాలు ఈ కూడలి దగ్గర ఎగురుతూ వుంటాయి. ఇక్కడే త్యాగధనుల స్మృతి చిహ్నం వుంది. 118 అడుగుల ఎత్తుండే ఈ "మాన్యుమెంటు టు ది పీపుల్స్ హీరోస్" అన్న శిల్పాన్ని చూస్తున్నప్పుడు నాటి విప్లవ యుగపు


గ్రాండ్ బుద్ధ

జ్ఞాపకాలు మళ్ళీ ఒక్కసారి మనస్సులో మెదులుతాయి. ఇక్కడే మావో జెడాంగ్ మసోలియం, చైనా విప్లవపు మ్యూజియం–రెండూ కూడా వున్నాయి. ఈ రెండు మ్యూజియంలు కూడా సందర్శకులు తప్పక చూడదగ్గవే.

బీజింగ్‌ను చుట్టి రావటానికి అండర్ గ్రౌండ్ రైలు సౌకర్యం వుంది. ఇలా కూడా ఈ నగరాన్నంతా చూసిరావచ్చు. టాక్సీలు కూడా సందర్శకులకు అందుబాటులో వుంటాయి. సరదా కలవాళ్లు టాంగ్‌హు నదిలో నౌకా విహారాలు కూడా చేయవచ్చు. ఈ నది వొడ్డునే నేచురల్ హిస్టరీ మ్యూజియం, స్వర్ణదేవాలయం వున్నాయి. ఈ రెండూ కూడా సందర్శకులు అస్సలు మిస్సవకూడదు.

దేవాలయాలు - పార్కులు

చైనాలో దేవాలయాలకు తక్కువేం లేదు. 'ఫర్ బిడెన్ సిటీ' అని చైనీయులు వ్యవహరించే రాజనగరంలో భూమికి, చంద్రుడికీ సూర్యుడికీ కట్టిన గుడులున్నాయి. భూదేవతకు ప్రత్యేకించిన డిటాన్ దేవాలయం, యుటాన్ అని పిలవబడే సూర్యదేవుని దేవాలయం, రిటాన్ అనే పేరుతో అలరారే చంద్ర దేవాలయం చూడదగ్గవే. వీటన్నింటికీ మించింది. స్వర్ణదేవాలయం. టియాన్‌టాన్ అని చైనీయులు వ్యవహరించే దేవాలయం కూడా చూడాల్సినదే. మింగ్ రాజ వంశస్థుల కాలంలో రూపుదిద్దుకున్న ఈ దేవాలయాలలోని శిల్పా కళా శోభ అపూర్వమనే చెప్పవచ్చు.

'మిలిటరీ మ్యూజియం'ను కూడా సందర్శకులు విధిగా చూడాలని ఉత్సాహపడుతూ వుంటారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ చరిత్రనంతా ఈ మ్యూజియం కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ వుంటుంది. బెహాయి, జెంగ్షాన్ పార్కులు కూడా అవశ్యం చూడదగ్గవే. ఈ పార్కులకు తూర్పు దిక్కున చైనా ఆర్ట్ గాలరీ వుంది ఈ ఆర్ట్ గాలరీలో వున్న అపూర్వమైన చిత్రకళాఖండాలను చూడటం కళాప్రియులు తమ కళ్లకు విందు చేసుకోవటమే అని చెప్పకోవచ్చు.

గ్రేట్‌వాల్ అని ప్రపంచ ప్రజలు వ్యవహరించే చైనా గోడ ప్రపంచపు వింతలలోనే ఒకటి. ఆరువేల కిలోమీటర్ల పొడుగున విస్తరించుకొని వున్న ఈ గోడను చూడటానికి బీజింగ్‌లోని పర్యాటక శాఖవారు ప్రత్యేక ఏర్పాట్లను కూడా చేస్తారు.

మింగ్ చక్రవర్తుల సమాధులను కూడా చైనా వెళ్ళిన యాత్రీకులు విధిగా సందర్శిస్తూ వుంటారు. 16 మంది మింగ్ చక్రవర్తులలో 13 మంది సమాధులు ఇక్కడ వున్నాయి. చారిత్రక ప్రాధాన్యతకల ఈ 'రాజ సమాధుల సందర్శనం మనల్ని గత వైభవ స్మృతులలోకి లాక్కెళు తుంటుంది.

యుగాంగ్ గుహలు

డాటింగ్‌కు పదిమైళ్ళ దూరంలో వున్న యుగాంగ్ గుహలు కూడా చైనా వెళ్ళినవారు



విధిగా సందర్శించవలసిన గుహలే. వుజ్‌హు పర్వతాలలోని ఈ గుహలలో 1500 సంవత్సరాల క్రితం చెక్కిన బౌద్ధ శిల్పాలు అత్యంత ఆకర్షణీయంగా వుండి సందర్శకులను ఆహ్లాదపరుస్తూ వుంటాయి. యుగాంగ్ గుహలు మొత్తం 53 ప్రతి గుహలోను 43 అడుగులకు తక్కువకాని ఓ బుద్ధ విగ్రహమన్నా వుంటుంది. ఇహ చిన్నాచితకా బుద్ధ ప్రతిమల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఈ గుహలలో మొత్తం 50 వేలకు పైగా బుద్ధ ప్రతిమలు వున్నాయి. ఈ గుహలోవున్న బ్రహ్మాండమైన శాక్యమని, మైత్రేయ విగ్రహాలు సందర్శకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతూ వుంటాయి.

ఇలా చైనాలో చూడవలసిన, స్థలాలు, వింతలు ఎన్నో.

◆

◆ కథ

కల చెదిరింది

ఆరుమళ్ల మాధవీలత
9848903838.

వేసవి కాలం. సమయం ఉదయం ఐదున్నర గంటలు. తూర్పు దిక్కున వెలుగు రేఖలు విచ్చుకుంటున్నాయి. అది పల్లెటూరు కావడాన జనం అప్పుడే లేచి దైనందిన కార్యక్రమా ల్లో నిమగ్నమౌతున్నారు. ఒక చేత్తో కాఫీ కప్పు. మరో చేత్తో ఆనాటి దినపత్రిక పట్టుకొని మేడమీద వసారాలో వున్న కుర్చీలో కూర్చొని పేపరు చదవడంలో నిమగ్నమ య్యాను. ఉదయాన్నే కాఫీ తాగుతూ భానుడి లేలేత కిరణాల తొలి పలకరింపు అందుకుంటూ, పక్షులు కిలకిలా రావాలు వింటూ ఆ పల్లెటూరు రోడ్లపై జన సంచారాన్ని గమనిస్తూ మధ్య మధ్యలో పేపరు చదువుకోవడం నాకిష్టమైన వ్యాపకం.

ఆ రోజు మా ఇంటిని ఆనుకొని వున్న ఖాళీ స్థలంలో పెరిగిన సుబాబుల్ చెట్లపై వాలిన చిన్ని పక్షులు ఏదో విషయమై గొడవ పడుతున్నట్లు రొద పెడుతున్నాయి. చదువుతున్న పేపర్‌లోంచి తల తిప్పి చూశాను. అక్కడ చాలా చిన్ని చిన్ని పక్షులున్నాయి. వాటి శరీరం లేత పసుపు రంగులో వుంది. పిచ్చుకల కంటే కొంచెం చిన్న సైజులో వున్న పక్షులవి. జంటలు, జంటలుగా చెట్ల కొమ్మలపై వాలి వున్నాయి. ఆడ పక్షులు చిన్నవిగా వున్నాయి. మగ పక్షులు కాస్త పెద్దవిగా వుండి, వాటి మెడ కింద నలుపు అవి మగ పక్షులనే విషయాన్ని తెలియచేస్తున్నాయి. ఈ పక్షులను గ్రామాల్లో 'గిజిగాడు' అని పిలుస్తారు. ఇవి గూడును నిర్మించడంలో నేర్పరులు. బహుశా అవి ఏ కొమ్మ మీద గూడు నిర్మించుకోవాలనే విషయమై గొడవ పడుతున్నట్టు నాకనిపించింది. మధ్య మధ్యలో ఆగుతూ అలసట తీర్చుకుంటూ అవి చాలా సేపు గొడవ పడ్డాయి. చివరికి ఓ పక్షి జంట విజయం సాధించి నట్టుంది. ఆ కొమ్మను ఆ పక్షులకు వదిలేసి మిగిలిన పక్షులు ఎగిరిపోయాయి.

పక్షులు వాటి మనుగడ కోసం, ఆహారం, నివాసం ప్రకృతితో ఎలా పోటీ పడి సంపాదించుకుంటాయో చూస్తుంటే చిన్నప్పుడు చదివిన డార్విన్ ప్రకృతి వరణ సిద్ధాంతం గుర్తొచ్చింది. ఆ రోజు నుంచి ఖాళీ చిక్కినప్పుడల్లా మేడ మీద వసారాలోకి వచ్చి ఆ పక్షుల దిన చర్యను ఆసక్తిగా గమనించడం అలవాటైంది నాకు.

ఓరోజు నేను వాటి దృష్టిని మళ్లించడానికి వాటికి కనిపించేటట్లు కొన్ని గింజలు మేడమీద ఖాళీ ప్రదేశంలో చల్లి దూరంగా వుండి గమనిస్తూ వున్నాను. ఆశ్చర్యమేమంటే అవి ఆ గింజలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఆ గిజలమీదగా ఎగిరిపోయేవి. కాని వాటిని ముట్టుకోనేలేదు. అవి ఆహారం కంటే తమ గూడును నిర్మించుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాయని నాకర్థమయ్యింది.

తమ నివాసం కోసం పోట్లాడి విజయం సాధించిన పక్షుల జంట మరికొన్ని పక్షులతో కలిసి రోజూ ఉదయాన్నే ఎక్కడికో ఎగిరిపోయేవి. గంట రెండు గంటల తర్వాత వాటి ముక్కులతో తెల్లని పోచల వంటివి తీసుకొచ్చేవి. వాటిని కాలిగోళ్లతో, ముక్కులతో గీకుతూ నునుపుగా చేసేవి. ఆడ మగ పక్షులు రెండూ కలిసి కొమ్మకు వేళ్లాడుతూ అవి తెచ్చిన పోచలతో ఒక గూడును తయారు చేయడంలో తలమునకలయ్యేవి. ఓరోజు నేను వాటి దృష్టిని మళ్లించడానికి వాటికి కనిపించేటట్లు కొన్ని గింజలు మేడమీద ఖాళీ ప్రదేశంలో చల్లి దూరంగా వుండి గమనిస్తూ వున్నాను. ఆశ్చర్యమేమంటే అవి ఆ గింజలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఆ గిజలమీదగా ఎగిరిపోయేవి. కాని వాటిని ముట్టుకోనేలేదు. అవి ఆహారం కంటే తమ గూడును నిర్మించుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాయని నాకర్థమయ్యింది. అది పక్షుల సంతానోత్పత్తి కాలం కాబట్టి త్వరగా అవి గూడును నిర్మించుకొని గుడ్లు పెట్టి పిల్లలను చేస్తాయి. ఈ క్రమంలో అవి ఆహార సేకరణకు అంత ప్రాధాన్యతనివ్వవు.

ఎట్టకేలకు 4-5 రోజులలో అందమైన గూటిని ఆ పక్షుల జంట నిర్మించుకున్నాయి. అంత త్వరగా అవి గూటిని కట్టుకోవడం... గూడు యొక్క నిర్మాణ కౌశలం... తుఫానుల్లో సైతం చెక్కు చెదరని పటుత్వం... ఆ చిన్న గూటిలోనే అంతస్తుల నిర్మాణం... కొద్ది రోజుల్లో ఈ లోకంలోకి రాబోయే బుజ్జి పక్షుల కోసం మృదువైన వాటి ఈకలతో అమర్చిన మెత్త... నన్ను ఆశ్చర్యానందాల్లో ముంచెత్తాయి. ఈ చిన్న పక్షులను చూసి మానవుడు నేర్చుకోవలసింది ఎంతో వుందని నాకనిపించింది. చిరుగాలికి సైతం సుతారంగా ఊగే ఆ గూటి ఊయలలో గువ్వల జంటను చూస్తే నాకు ముచ్చటేసింది.

ఇప్పుడు ఆడపక్షి ఆగూట్లో గుడ్లు పెట్టింది. ఆ జంట పక్షుల్లో గూడు నిర్మించుకొనేటప్పటి ఆందోళన, అలజడి

తగ్గాయి. ఆడపక్షి ప్రశాంతంగా గూటి పట్టునే వుంటూ గుడ్లను సంరక్షిస్తుంది. మగపక్షి ఆహారం కోసం ఉదయాన్నే పోయి ఆహారం సేకరించి తెచ్చి ఆడపక్షికిస్తుంది. అలా ఆ గువ్వల జంట సంతోషంగా సహజీవనం చేస్తున్నాయి.

ఓరోజు సాయంకాలం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి బడలికగా వుండడంతో తల స్నానం చేసి చల్లటి గాలి వీస్తుండగా మేడ మీద వసారాలో నాకిష్టమైన ప్రదేశంలో సేదదీరుతూ యధాలాపంగా పక్షులేం చేస్తున్నాయో అని పక్కకు చూశాను.

మేడమీద పిట్ట గోడను మించి పెరిగిన చెట్లు, చెట్టు కొమ్మలకు వేళ్లాడుతున్న గూళ్లు ఏవీ కనిపించలేదు. వెంటనే కుర్చీలోంచి లేచి పిట్టగోడవైపుగా వెళ్లి చూశాను. అంతే...ఆ దృశ్యం మనసును కలచివేసింది. ఆ సుబాబుల్ చెట్లను ఎవరో మొదలంటూ నరికివేశారు. బహుశా పశువులకు ఆహారంగా వేయడానికి ఆ స్థల యజమానే ఆ మొక్కలను కొట్టించి వుంటాడు. పాపం! గిజిగాడి గూళ్లన్నీ కొట్టి పడేసిన కొమ్మలకు అంటి పెట్టుకొనే కిందపడి వున్నాయి. ఆ గూళ్లలోంచి గుడ్లు నేలమీద పడి పగిలిపోయాయి. గూళ్లున్న కొమ్మలను సైతం వదిలిపెట్టకుండా కొట్టి పడేసిన ఆ మనిషి కసాయితనాన్ని చూస్తే నిస్సహాయంగా అరవడం తప్ప ఆ పక్షులు మరేం చేయలేకపోయాయి. ఆ చిన్ని పక్షులు నరికి పడేసిన మొదళ్లపై నిలబడి హృదయ విదారకంగా అరుస్తున్నాయి. చీటికి మాటికి ఆ గూళ్ల దగ్గరికి వెళుతూ, పగిలిన గుడ్లను చూసుకుంటూ దీనంగా అరుస్తూ దిక్కులు చూస్తున్నాయి. ఆ పక్షుల దీనమైన అరుపులు 'ఓ మనిషీ! నీకు హృదయం లేదా?' అని ప్రశ్నిస్తున్నట్టుగా తోచింది నాకు. బాధతో కళ్లు చెమ్మగిల్లాయి.

మరుసటి రోజు ఉదయాన్నే తమ కువకువలతో నిద్ర లేపే పక్షుల అరుపులు నాకు వినిపించలేదు. ఉదయం నిద్ర లేచి పిట్ట గోడ పక్కగా వెళ్లి చూశాను. అందమైన సుందర వనంలా వుండే ఆ చోటు మొదలంటూ నరికిన మోడులతో స్పందనలు కోల్పోయిన మనిషి హృదయంలా కనిపించింది. ఆ చిన్ని చిన్ని పక్షుల జంటలు మాత్రం ఆ ప్రాంతంలో మరెప్పుడూ నాకు కనిపించలేదు. ■

◆ కవిత్వమ్

అనాదిగా స్త్రీ...

మంచులో స్నానించిన గరిక
హరిత తివాసీగా మారింది
గడ్డి పూలపై వాలిన మంచు బిందువులు
ముత్యాల్ని మురిపిస్తున్నాయి
రెండూ నా కాళ్ళ కింద నలిగిపోవటం బాధగా
వుంది!
నా ప్రయాణం సాగుతుంది
సూర్యుడి రాకకు ఒక చూపు
ఎప్పుడూ కాయలు కాస్తుంది
సూర్యుణ్ణి చూసి తనూ వికసించటం
వెదజల్లిన కాంతిని చెక్కిళ్ళపై
పులుముకోవటం ఒక పద్మానికే చెల్లుతుంది
చంకబిడ్డతో స్త్రీ దుఃఖిస్తూ
చెరువు కట్టపై నడుస్తూంది!
నా ప్రయాణం సాగుతూంది
కాలమన్నాక సమయాలు తప్పవు
ప్రయాణమన్నాక మజిలీలు తప్పవు
కాలం సాయం సంధ్య వేషం వేసింది
జాబిలి కోసం నిరీక్షిస్తుంది
ప్రభవించిన చంద్రుణ్ణి చూసి
కురులారబోసుకోవటం
ఒక కలువకే సొంతం
కొలను గట్టుపై కూర్చున్న యువతి
కన్నీరు కారుస్తూంది!
నా ప్రయాణం సాగుతూంది
సముద్రం ఆకాశాన్ని పొదివి పట్టుకుని
అంతర్భాగం చేసుకుని
సృష్టికీ ప్రతిసృష్టి చేశానంటూ
విశ్వామిత్రుడికి సవాలు విసిరింది
చల్లని సముద్రం నా కాళ్ళకు తగిలి
వొణకుతున్న వొళ్ళు చేతుల్లో వొదిగి
స్త్రీ ఆర్తనాదం వింది
వాళ్ళిద్దరూ పెనుగులాడుతున్నారు
ఆమె ఏడుపు సముద్ర ఘోషను మింగేసింది
సందర్భం అతను చెప్పటం లేదు
విషయం ఆమె విప్పటం లేదు
పూరి గుడిసెల్లోనూ
ఏడంతస్తుల్లోనూ
పల్లెల్లోనూ
ఆడజన్మది కన్నీరే కన్నీరు
కాకపోతే కష్టాల తీరులు వేరు
నా ప్రయాణం ఆగింది!

అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ - 9848252946

అన్ని వైపులా మృత్యువే



భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి ముప్పయ్యేళ్లు. పాతిక వేల మందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. దుర్ఘటనను వెలుగులోకి తేవడానికి, విషాదాన్ని ప్రపంచం ముందుంచడానికి మీడియా అక్కడికి చేరింది. అప్పటికే రఘు రాయ్ పేరొందిన ఫొటోజర్నలిస్టు. దుర్ఘటనకు సంబంధించిన ఫొటోలలో రాయ్‌వే ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆయన తీసిన వాటిలో...మట్టిలో కూరుకు పోయిన పాప ఫొటో భోపాల్ విషాద చిహ్నంగా నిలిచిపోయింది. 1984లో ఫొటోలు తీయడానికి భోపాల్ వెళ్లిన రాయ్ అనుభవాలు ....

విషాద ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన నాటి జ్ఞాపకాలేవైనా చెప్తారా...?

అప్పట్లో నేను 'ఇండియా టుడే' ఫొటో ఎడిటర్‌గా వున్నాను. అలాగే 'మేగ్నమ్ ఫొటోస్' భారత ప్రతినిధిని కూడా. రాత్రి 12.30 గంట లకు మా ఎడిటర్ నుంచి ఫోన్ వచ్చింది. గ్యాస్ లీక్ అవుతోందని... ఉదయపు విమానంలో ఢిల్లీ నుంచి భోపాల్ చేరుకోమని... చెప్పారు. అర్ధగంట తర్వాత ప్యారిస్‌లోని మేగ్నమ్ కార్యాలయం నుంచి కూడా ఫోన్ వచ్చింది. అంటే ఆ మధ్య రాత్రికే ఈ వార్త ప్రపంచం అంతటికి తెలిసి పోయింది.

ప్రమాద తీవ్రతను మీరు ముందే ఊహించగలిగారా?

లేదు. 'యూనియన్ కార్బైట్' ఫ్యాక్టరీలో ఏదైనా సమస్య కారణంగా గ్యాస్ లీకయ్యిందేమోనని, కొద్దిసేపటికి అదే ఆగిపోతుందని ... అక్కడి ప్రజలు...ఫ్యాక్టరీ ... దాన్నుంచి బైట పడతాయని అనుకున్నాం. మేం ఉదయం 8...8.30 గంటల మధ్యలో అక్కడికి చేరుకొని... హమీదియా ఆస్పత్రికి వెళ్లాం. స్థానికంగా అదే అతి పెద్ద ఆస్పత్రి. ప్రాణాలు కోల్పోయిన వారిని అక్కడికి మోసుకొస్తున్నారు. మార్గమధ్యలో కూడా... చనిపోయిన జంతువులు, ఉబ్బిపోయిన మృత దేహాలు... ఎక్కడ పడితే అక్కడ కన్పించాయి. అప్పుడే యుద్ధం ముగిసినట్టు.... అన్ని వైపులా మృత్యువే. జబ్బు పడినవారిని, గాయపడినవారిని కాపాడేందుకు మిగతావారు ప్రయత్నిస్తున్నారు.

ఇతర మీడియా వాళ్లు కూడా వుండే వుంటారు?!

జాతీయ అంతర్జాతీయ పత్రికల వాళ్లు పెద్ద సంఖ్యలో వచ్చారు. మృత దేహాల కోసం.. మృత్యువుతో పోరాడుతున్న వారి కోసం... నగరంలో రాబందుల్లా చూశాం.

ఆ రోజున కెమెరాలు, రీళ్లు, పూర్తి స్థాయి పరికరాలతో అక్కడికి చేరుకున్నారా?

కెమెరాలు, లెన్సులు మరీ అంత భారీగా తీసుకెళ్లలేదు. సాధారణ కెమెరా, 5-7 రోజులకు సరిపడా రీళ్లు ... అంతే. మొదటి రోజున పిచ్చిపట్టినట్టు ఫొటోలు తీశాం. అవి అక్కడి పరిస్థితికి అద్దం పడ తాయి. రెండవ రోజు కొద్దిగా తగ్గించాం. మూడు నాలుగు రోజుల్లో అంత పిచ్చిగా ఫొటోలు తీయలేదు.

మంచి ఫొటో తీయడం కోసం... వేచి చూశారా?

భోపాల్ వంటి విషాదం జరిగిన చోట... వేలాది మంది చనిపోయిన చోట చనిపోతున్న చోట... దేన్ని కెమెరాలో బంధించాలి? దేన్ని విడిచి పెట్టాలి? అని ఆలోచించుకునే సమయమే లేదు. అన్నీ రెప్పపాటులో జరిగిపోయాయంతే. పరిస్థితిని అర్థం చేసుకుంటూ అలా ఫొటోలు తీసుకుంటూ వెళ్లాం. ఆ ఫొటోలే దుర్ఘటనకు సజీవ సాక్ష్యాలు. అన్ని మరణాలు సంభవించాయక్కడ. ప్రతి నిముషం ఉద్రిక్తభరితంగానే వుంది.

అక్కడ ఎన్ని రోజులున్నారు?

నాలుగు రోజులనుకుంటా! అప్పటికి మాది పక్ష పత్రిక. విదేశీ పత్రిక ప్రచురణకు ఆఖరి గడువు దగ్గర పడడంతో... మూడు నాలుగు రోజులపాటు అక్కడే వుండి ఫొటోలు తీయాల్సి వచ్చింది.

మట్టిలో కప్పబడిన చిన్నారి ఫొటో గురించి చెప్తారా?

హిందువులు చనిపోయిన వారిని దహనం చేస్తారు. అక్కడ సామూహిక అంతిమ సంస్కారాలు జరిగాయి. పెద్ద కట్టెల కుప్ప మీద శవాలు వేసి తగలపెట్టారు. అదే ముస్లింలైతే... సమాధి చేస్తారు.

అక్కడ మూడేసి శవాలను ఒకదాని మీద ఒకటి వేసి కప్పెట్టారు. గుంట తవ్వడం... శవాన్ని పూడ్చడం...కొంత మట్టి వేసి మరో శవాన్ని పూడ్చడం...ఇలా జరిగింది. నిజానికి అది ఒక చిన్నారి కాదు. ఇద్దరు చిన్నారుల శవాలు. ఒక దాన్ని మట్టిలో పూడ్చి దాని మీద మరోటి వేయబోతున్నారు.... అమాయకపు మోము... తెరచిన కళ్లు... మనిషి చెయ్యి... కదిలించి వేస్తుందనుకున్నానీ ఫొటో.

ఎప్పుడైనా భోపాల్ వెళ్లాలనుకున్నారా?

లేదు. మంచో చెడో ... శాస్త్రాలజీని నేను నమ్మను. ఎందుకంటే జీవితం అలా సాగిపోతుంటుంది. ఏళ్ల తరబడి ... పత్రికల్లో పని చేసిన కారణంగా ఒక వాస్తవం తెలుసుకున్నాను. ఇవాళ ఒకటి జరిగితే అదే పత్రికకు చాలా ముఖ్యం. రేపు మరోటి జరిగితే అదే ప్రధానం. అదో పాఠం నాకు. తీసిన ఫొటోలలో శక్తి, సారం వుంటే ... అది ఎప్పటికి నిల్చిపోతుంది. జనం దాన్ని గురించే మాట్లాడుకుంటారు. ప్రతి సందర్భంలోనూ ఫొటోలు తీసినప్పుడు ... పోల్చడం అంత మంచిది కాదు. ప్రతి దానికి తనదైన ప్రత్యేకత, ప్రభావం వుంటుంది.

◆

◆ సమ్‌థింగ్ స్పెషల్

అవినీతిలోనూ అగ్రదేశమే



లంచం తెలుగు, ఘూస్ హిందీ, కిక్‌బాక్ ఆంగ్లం ఇలా ప్రతి భాషలోనూ అందరికీ తెలిసిన పదాలలో ఇదొకటి. ఎందుకంటే 'ఇందు లేడను సందేహము వలదు ఎందెందు వెదికిన అందందు కలడు చక్రి' అన్నట్లుగా అమ్యామ్యా లేని దేశం, సమాజం, రంగం లేదంటే అతిశయోక్తి కాదు. ఆత్మవంచన ఏమంటే బహిరంగంగా ఏ ఒక్కరైనా లంచాన్ని సమర్థించే వారు మనకు కనిపించరు. లంచాలకు దూరంగా ఉండేవారు, ఇవ్వటాన్ని సహించని వారు కూడా తమ దాకా వస్తే తప్పనిసరి అయినపుడు అది చిన్నదా పెద్దదా అన్నది పక్కన పెడితే లంచం ఇవ్వక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. సమాజహితం కోసం కొన్ని సందర్భాలలో లంచం ఇవ్వాల్సి ఉంటుందంటే అతిశయోక్తి కాదు. అంతర్గత విషయాలు రాబట్టటానికి, అవినీతిని బయట పెట్టటానికి మీడియాలో కొంత మంది నేతలకు ఎక్కువ ప్రచారమివ్వటం కూడా 'లంచమే'. పెద్ద చేపల అవినీతిని బయటకు తీయాలంటే చిన్న చేపలకు 'లంచాల' ఎరవేయక తప్పదు. వీటిని సమాజానికి ఉపయోగపడే 'లంచాలు' అనవచ్చా? అయితే ఇలాంటివి సముద్రంలో కాకి రెట్ట వంటివి.

ఇంతకీ సందర్భం ఏమంటే లంచం గురించి మాట్లాడుతున్న కొద్దీ అవి ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదు. ఇక నుంచి మేకలను తినే వారి పట్ల ఏమాత్రం ఉపేక్షించరాదని తోడేళ్ల సమావేశం తీర్మానిస్తే ఏం జరుగుతుంది? అమెరికా, బ్రిటన్ వంటి ధనిక దేశాలలో అవినీతి తక్కువగా ఉంటుందని కొంత మంది కథలు కథలుగా చెబుతారు. చిల్లరమల్లర అవినీతి విషయంలో మాత్రమే అది వాస్తవం. ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ(ఒయిసిడి) తాజా నివేదిక ప్రకారం ప్రతి లావాదేవీలో సగటు ముడుపుల మొత్తం 10.9శాతంగా ఉందట. అంటే పదిపైసలదేముంది నూటికి పదకొండు రూపాయలనుకోండి. అదే ఇంకో రూపంలో చెప్పాలంటే ఒక లావాదేవీలో వచ్చిన లాభంలో 34.5శాతం ఉందట. వంద రూపాయల లాభం వచ్చిందనుకోండి రు.34.5 లంచం ఖాతాకు కేటాయిస్తున్నారు. ఓయిసిడి పరిశీలించిన లంచం కేసుల వివరాల ప్రకారం ఒక్కొక్క ఉదంతంలో సగటున చేతులు మారిన ముడుపుల మొత్తం 1.38 కోట్ల డాలర్లు. అంటే 80 కోట్ల రూపాయలకు పైమాటే. ఈ వివరాలన్నీ చెప్పిన ఆ నివేదికలో కొసమెరుపేమిటంటే ఇది సముద్రంలో కొకి రెట్ట పరిమాణమంత అన్నది నిస్సందేహం అని కూడా చెప్పింది. ఈ సంస్థ సమీక్షించిన అవినీతి కేసులన్నీ ధనిక దేశాలకు చెందినవే, ఇచ్చిందీ, పుచ్చుకుందీ అక్కడి వారే.

లంచం ఎలా తీసుకుంటారంటే పాత సినిమాలు చూస్తే బల్లకింద చేతులు పెట్టితీసుకోవటంగా మనకు అర్ధం అవుతుంది. ఒక్కొ కేసు నిర్ధారణకు 1999లో రెండు సంవత్సరాలు పడితే ఇప్పుడు ఏడు సంవత్సరాలైనా తేలటం లేదట. ఒక కేసులో పదిహేను సంవత్సరాలు పట్టింది. అంటే ముడుపులు చెల్లించటం, తీసుకోవటంలో కూడా కొత్త సాఫ్ట్‌వేర్‌లు వచ్చాయి. దర్యాప్తు సంస్థలకు ఒక పట్టాన అర్థం కావటం లేదట. ఉదాహరణకు ఒక కంపెనీ ఒక కాంట్రాక్టు పొందినందుకు ప్రతిఫలంగా ఒక మంత్రిగారి కుమారుడు లేదా కుమార్తె పేరుతో ఉన్న కంపెనీకి రెండు వందల కోట్ల రూపాయలు అప్పుగా లేదా పెట్టుబడిగా పెట్టినట్లు అధికారికంగానే బదలాయించారనుకోండి. ఇప్పుడు జరుగుతున్న వ్యవహారాలన్నీ ఇవే. బల్లకింద కాదు బహిరంగ వ్యవహారమే. దీన్ని అవినీతిగా తేల్చకుండా ఏండ్ల తరబడి నాన్చాలంటే మరికొన్ని లంచాలు. ఇదంతా అయ్యే సరికి ఆ కంపెనీలు దివాలాతీసినట్లు ప్రకటించి లెక్కలన్నీ పక్కాగా తయారు చేస్తారు. తరువాత అవినీతి తేలినా మీడియాకు వార్తలు తప్ప ఖజానాకు వచ్చేదేమీ ఉండదు.

లంచం ఇచ్చేవాడిది ఎంత తప్పో పుచ్చుకొనే వాడిదీ అంతే తప్పు అంటారు కొందరు. అంటే ఇద్దరూ తప్పు చేశారు గనుక ఇద్దరినీ శిక్షించకుండా వదిలేయమనా? అలా చేస్తే ఇంక లంచం గురించి అసలు చర్చించుకోవాల్సిన అవసరమేముంది. మనకు అవసరమైనపుడు ఇచ్చుకుంటాం, పుచ్చుకుంటాం. సరికి సరి. కానీ వాస్తవం అలా లేదే మన కంపెనీకి అవసరమైన ఆర్డర్లు రాబట్టటానికి, టెండర్లు దక్కటానికి ఏం చేస్తారో మాకు తెలియదు, ఆవు ఎక్కడ తిరిగినా దూడ మాత్రం మనదొడ్లో ఈనాల్సిందే అన్నట్లు పైన పేర్కొన్న నివేదిక ప్రకారం 53శాతం కేసులలో యాజమాన్య స్థాయిలో ఉన్న ఉద్యోగులకు లంచాలు ఇచ్చేందుకు యాజమాన్యాలు అధికారమిచ్చాయట. ఇక ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లుగా ఎంత పెద్ద కంపెనీ అయితే అంతగా ముడుపులు ఇచ్చాయి. ఇలాంటి కేసులలో ఎవరిని శిక్షించాలి? పోనీ ఇలాంటివి ఎవరో చిన్న ఉద్యోగులు, పేద దేశాలలో జరుగుతున్నాయా అంటే కాదే.

1999 నుంచి ఈ ఏడాది జూన్ వరకు దర్యాప్తు తేలిన కేసులలో అమెరికా ఏ దేశానికీ అందనంత ఎత్తున 128 కేసులో అగ్రస్థానంలో ఉంటే రెండవదిగా జర్మనీ 26, దక్షిణ కొరియా 11 కేసులతో మూడవ స్థానంలో ఉన్నాయి. అంటే అవినీతిలో కూడా అమెరికా అగ్రస్థానంలోనే ఉంది.అత్యధికంగా లంచాలు ఇచ్చేవి చమురు, గ్యాస్, గనులు, నిర్మాణ, రవాణా రంగాలుగా ఉన్నాయి.పుచ్చుకొనే వారు ఉన్నతాధికారులు, మంత్రుల వంటి బడా మనుషులు. కొన్ని కంపెనీలు ముడుపులిచ్చి దొరికి పోతే జరిమానాలు ఇచ్చి తప్పించుకుంటున్నాయి. ఉదాహరణకు జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ కొన్నేళ్ల క్రితం 240 కోట్ల డాలర్లు చెల్లించింది. అమెరికాలో వైద్యులకు లంచాలు, మా మందులు వాడితే ఎలాంటి ప్రమాదం ఉండదని తప్పుడు ప్రచారం చేసి ఇబ్బందుల పాలు చేసిన కేసులలో గ్లాక్సోస్మిత్‌క్లిన్(జిఎస్‌కె) కంపెనీ 2012లో 300 కోట్ల డాలర్లు చెల్లించి వివాదాలను పరిష్కరించుకుంది. అంటే వాటికి అంతకంటే ఎన్నో రెట్లు లాభం వచ్చి ఉంటుంది. ఇంక నిత్యం మన కళ్ల ముందే వైద్యులకు, మందుల దుకాణాల వారికి ముడుపులు చెల్లించే ఔషధ దుకాణాలు చెల్లించే జరిమానాల గురించి చెప్పనక్కరలేదు. లేకుంటే కంపెనీ డైరెక్టర్లు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడి ఉండాలి. చిత్రమేమంటే ఎన్ని సంక్షోభాలు వచ్చినా దివాళాతీసి మన పత్తి రైతుల మాదిరి ఆత్మహత్య చేసుకున్న వ్యాపారి లేదా పారిశ్రామికవేత్త ఒక్కరంటే ఒక్కరు లేరు. అందువలన అవినీతి అంతమే నా పంతం అని ఎవరైనా అంటే వారు ఎక్కడి నుంచి ప్రారంభించాలంటే పై నుంచే అని వేరే చెప్పనవసరం లేదు.

- సత్య

◆ వింత లోకం



బరువా...టి చెప్పులు

ఎలాంటి వాతావరణానికైనా తట్టుకునే చెప్పులు వుంటే బావుండని ఎప్పుడైనా అనుకున్నారా? అయితే చలో ధావల్పూర్ గ్రామం. ఇది మహారాష్ట్రలో వుంది. ఒక్కడ ఒకతను స్వయంగా కుట్టే చెప్పులకో ప్రత్యేకత వుంది. ధావల్పూరి చెప్పులుగా పిలిచే వీటికి దున్నపోతు చర్మం, పాత విమానం టైర్లతోనూ తయారు చేశాడు. మొత్తంమీద పశువుల చర్మంతో సూపర్ ఫినిషింగ్ ఇచ్చాడు. ఇవి సుమారు మూడు కిలోల బరువుంటాయి. ఇక వీటిని వేసుకుని తిరగాలంటే కొద్దిగా కష్టమేననుకోండి. అయినా అక్కడి జనం ఎలా వేసుకుంటున్నారో!

మగవారికి పురిటి నొప్పులు!

నెలలు నిండిన భార్యకు బదులు భర్తలు నొప్పులు పడితే ఎలా వుంటుంది? తెలుసుకోవాలనుంటే మమ్మల్ని కలవండి అంటున్నారు చైనా డాక్టర్లు. పురుటి నొప్పులు పడాలనుకున్న భర్తలకు వారంలో రెండు సార్లు ఐమా మెటర్నిటీ ఆసుపత్రి ఈ సౌకర్యం కల్పించింది. ఈ థ్రిల్ అనుభవించేందుకు వంద మందికి పైగా భర్తలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దీంతో అసలు కథ ఇక్కడ నుంచి ప్రారంభమౌతుంది. ముందుగా వీరికి పొత్తి కడుపు దగ్గర ప్యాడ్స్ వుంచుతారు. ఆ తర్వాత ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వడం మొదలెడతారు. అయిదు నిమిషాల పాటు కొనసాగే ఈ ప్రక్రియలో షాక్ స్కేల్ ఒకటి నుంచి పది వరకు పెంచుకుంటూ పోతారు. కొంత మంది లెవల్ సెవన్ లోనే ఓర్చుకోలేక బాధపడుతూ షాక్స్ ఆపేయమని ప్రాధేయపడితే... మరి కొందరు అసలు వద్దురా బాబూ అంటూ తప్పించుకున్నారట. ఎంతైనా కృత్రిమంగా రప్పించే నొప్పులు సహజమైన వాటి మాదిరిగా వుండవట. కానీ ఒక సారి ఈ నొప్పులు పడ్డ భర్తలకు మాత్రం భార్యల మీద ప్రేమ పెరగడం ఖాయమంటున్నారు డాక్టర్లు.

బొమ్మల గ్రామం

పల్లెల్లో జనాభా నానాటికీ తగ్గిపోతోంది. పనిపాటలు వెతుక్కుంటూ పట్టణాలు, నగరాలు వెళ్లేవారి సంఖ్య పెరిగిపోతోంది. దక్షిణ జపాన్‌లోని నగోరో సరిగ్గా అలాంటి గ్రామమే. ప్రస్తుతానికి అక్కడ కేవలం 35 మంది మాత్రమే మిగిలారు. అలా వలస వెళ్లిన వారిలో అయానో కూడా వుంది. అయితే ఓసారి గ్రామాన్ని చూడ్డానికి వచ్చి వెలవెలపోతున్న ఊరిని చూసి తట్టుకోలేకపోయింది. వెంటనే తనకు చేతనైన విద్యతో సాంత్వన పొందాలనుకుంది. అలా స్కూళ్లు, పొలాలు, రోడ్లు, ఇళ్లు, వీధులు, బస్టాపుల్లో మనిషి సైజు గుడ్డ బొమ్మలను తయారుచేసి పెట్టేసింది. దూరం నుంచి చూడ్డానికి నిజమైన మనుషుల్లానే వుండడంతో సంతోషపడుతోందట అయానో.

నో..నూడుల్స్...

నోరూరించే నూడుల్స్ అంటే ఇష్టం లేనిదెవరికి? అయితే మరీ అతిగా తినడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని ఓ అధ్యయనం చెప్తోంది. గుండె జబ్బులకు ఇది కూడా కారణమౌతుందని పరిశోధకులు చెబుతున్నప్పటికీ దక్షిణ కొరియా, చైనా, జపాన్ వంటి దేశాలలో నూడుల్స్‌కు విపరీతమైన డిమాండ్ వుంది. ముఖ్యంగా సౌత్ కొరియా వాసులు దీనిని ఎక్కువగా లాగించేస్తుంటారని దీనివల్ల వారిలో హృదయ సంబంధ సమస్యలు తలెత్తుతుంటాయని అమెరికాలోని 'బేలర్ హార్ట్ అండ్ వాస్కులర్' ఆస్పత్రి వర్గాల అధ్యయనం చెప్తోంది. అయితే నూడుల్స్‌లో వుండే సోడియం ఆరోగ్యానికి అంత మంచిది కాదన్న విషయాన్ని కొరియన్లు తోసిపుచ్చుతున్నారు. పైగా సవాల్ కూడా విసురుతున్నారట. వారానికి రెండు మూడుసార్లు నూడుల్స్ తింటున్నా తమకేమీ కావడం లేదన్నది వారి మాట.

నవ్వుల్ – పువ్వుల్

డిశ్చార్జి

పేషెంట్ – నన్ను ఎప్పుడు డిశ్చార్జి చేస్తారు డాక్టర్‌గారూ...!
డాక్టర్ – మొన్ననే కదా నా బిల్డింగ్ శంకుస్థాపన చేసాను... చూద్దాం...!

ప్రేమించాలి

టీచర్ – తోటి విద్యార్థులను ప్రేమించాలిరా...!
చరణ్ – అదే విషయం గీతతో చెబితే, నా కాళ్లు విరగ్గొడతానన్నాడండీ వాళ్ల నాన్న...!



బదులు



కాంతం – మీరు చాలా పొదుపరి అట, అందరూ చెప్పుకుంటున్నారు!
జయ – అదేం లేదు... ఏదో వాళ్ల మానాన వాళ్లు వాగుతుంటారంతే...!
కాంతం – ఓ కేజీ పంచదార బదులివ్వు వదినా...!
జయ – కేజీ కాదుగానీ, నాలుగు పలుకులిస్తా, మరల తిరిగి ఇచ్చేటప్పుడు ఎనిమిది పలుకులివ్వాలి సరేనా...!

ఇవ్వలా

జయ – మా ఆయన మా దగ్గర డబ్బు తీసుకుని ఇప్పటివరకూ ఇవ్వలేదు. కంప్లెయింట్ రాసుకోండి...!
పోలీస్ – మీ ఆయన తీసుకున్నారా... ఎప్పుడు...?
జయ – మా పెళ్లికి... కట్నంగా...?



ధర్మం

భిక్షగాడు – చచ్చి మీ కడుపున పుడతాను, ఓ పది రూపాయలు ధర్మం చేయండి...!
వెంకాయమ్మ –బేభై రూపాయలు ధర్మం చేస్తాగానీ, ఆ ఎదురింటావిడ కడుపున పుట్టి, అడుక్కుంటూ వుండు...!

ఫిర్యాదు



రాజారావు – ఓ ప్రాణికి యాక్సిడెంట్ అయింది. ఫిర్యాదు రాసుకోండి...!
పోలీస్ – ఓ అలాగే... ఇంతకీ ఏ ప్రాణికి...?
రాజారావు – రోడ్డు పక్కనే వెళుతున్న చీమకి...!

పశువు నయం



తండ్రి – నీకన్నా ఆ పశువు నయంగా. రోజూ కొన్ని పాలయినా ఇస్తుంది...!
కొడుకు – అయితే ఆ చదువేదో దానికీ చెప్పించి, దాని చేత ఉద్యోగం చేయించు...!

సెంటిమెంటు

పేషెంటు – నర్స్, నర్స్. ఆపరేషన్ థియేటర్‌లోకి పిచ్చోడెవరో కత్తి పట్టుకుని వచ్చేసాడు...!
నర్స్ – కంగారు పడకు. ఆయనే డాక్టరు. మొదట్లో ఆయన ఆ కత్తితోనే ఆపరేషన్లు చేసేవారట. అందుకే సెంటిమెంట్‌గా దానిని కూడా తెచ్చుకుంటారు...!

ఎందుకు?

భార్య – ఏవండీ, సినిమాకెళదామండీ...!
భర్త – సినిమాకెందుకు, టీవీ వుందిగా...!
భార్య – మీకు బైక్ ఎందుకు, కాళ్ళు వున్నాయిగా...!

తేడా

సుబ్బారావు – పెంపుడు కుక్కకీ, వీధికుక్కకీ తేడా ఏమిట్రా...?
వెంకీ – ఆ రెండింటి చేత ఒకేసారి కరిపించుకోండి. తేడా ఏమిటో మీకే తెలుస్తుంది...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు, ఫోన్ నెం : 9963298921

కళాపోషకుడు బాపు

ఒక సూర్యుండు ఒక్కొక్కరికి ఒక్కొక్క భంగి అన్నట్టు బాపును తల్చుకుంటే వారి వారి అభిరుచిని ఆసక్తిని అవసరాన్ని బట్టి పరిపరివిధాల గుర్తుకు వస్తారు. తెలుగు అక్షరాల వయ్యారాన్ని వైభవాన్ని ఆవిష్కరించారు. హృదయపు లోతులు తాకే మానవీయ చలన చిత్రాలను సృష్టించారు. గుర్తు రాగానే గిలిగింతలు పెట్టే సునిశిత చమత్కారాన్ని సృజించారు. ప్రబంధ వర్ణనలను దాటి అందాలను కొత్త కోణాలలో చిత్రిక పట్టారు. తెలుగు పుస్తకాల ముఖ సౌందర్యానికి మారు పేరైనారు. ఇన్నిటిలోనూ మనం వెండి తెరపై బా పూ స్పర్శ ఎలా మరుపురానిదిగా నిలిచిపోయిందో చూద్దాం.

డిసెంబర్ 15 బాపు జయంతి

బాపు (కథకుడుగా నిర్మాతగా వున్న రమణతో కలసి) 1967లో 'సాక్షి' చిత్రంతో రంగ ప్రవేశం చేశారు. కృష్ణ, విజయ నిర్మల ప్రధాన పాత్రధారులు కాగా జగ్గారావు ప్రతికూల పాత్రధారి. నాయికను అన్నగా ఎంతగానో ప్రేమించే విలన్ వూరందరినీ హడలగొట్టే గూండా డ్రైవర్ ఫకీర్. అతను అందరి ఎదటా చేసిన హత్యకు కూడా సాక్ష్యం చెప్పడానికి వూరి వారు వెనుకాడతారు. అమాయకుడైన హీరో కృష్ణను ఒప్పించి సాక్ష్యం చెప్పిస్తారు. అతను బయిటకు వచ్చేసరికి వూళ్లో ఎవరూ ఆసరాగా నిలబడరు. నాయిక అండగా వుండి.. అత్త కడుపు చల్లగా అమ్మ కడుపు చల్లగా బతకరా బతకరా పచ్చగా.. అని పాడి మరీ తాళి కట్టించుకుంటుంది. అప్పుడైతే అన్న అతన్ని ఏమీ చేయడని భరోసా ఇస్తుంది. అయితే ఫకీర్ మాత్రం దాడి చేయబోతే కృష్ణ హతమార్చేస్తాడు. ఇదీ కథ. హీరో హీరోయిన్లు మినహా అంతా కొత్త నటీనటులు. అంతా బాపూ విశ్వరూపమే. గోదావరి సౌందర్యాలను, మనోహర సంగీతాన్ని ఆర్ద్రమైన ఇతివృత్తాన్ని ఎన్నుకోవడమే గాక చెడును ఎదిరించాలనే సందేశం కూడా అందించారు బాపు. ఈ చిత్రంలో కృష్ణకు చాలా పేరొచ్చింది. జగ్గారావు ఈ ఒక్క చిత్రంలోనే ప్రధాన పాత్ర ధరించాడు. పెద్ద స్టార్లు, కృత్రిమ సన్నివేశాలు, శ్రుతి మించిన మేకప్పులు లేని బాపు ముద్ర మొదటి చిత్రంతోనే తెలిసిపోయింది. రమణ అప్పటికే పేరున్న సినీ రచయిత.

ఆ వెంటనే బాపు 'బంగారు పిచుక' (1969) తీశారు. ఇందులో విజయ నిర్మలే నాయిక కాగా చంద్రమోహన్ నాయకుడు. కలవారి అబ్బాయి ఇంట్లోంచి పారిపోయి లోకం తెలుసుకోవడం ఇతివృత్తం. హాస్యం బాగా పండుతుంది. పెద్ద విజయం సాధించలేదు.

అక్కినేని ద్విపాత్రాభినయంతో తీసిన 'బుద్ధిమంతుడు' (నాయిక విజయ నిర్మలే) ఒక సందేశాత్మక సంధిగ్ధాత్మక చిత్రం. విపరీతమైన దైవభక్తి గల బాపు రమణలు దాన్ని ఏకపక్షంగా చెప్పలేక వదులుకోలేక చిత్ర యాత్ర పొడుగునా పడిన బాధకు ఈ చిత్రం మొదలు. బ్రహ్మచారి పూజారిగా అన్న, జులాయిగా వుండి ప్రేమ కారణంగా మారిన తమ్ముడు.. దుష్ట సర్పంచి మోసాలు. అన్నాతమ్ముల మధ్య జరిగే ఆస్తిక నాస్తిక సంవాదం ఈ చిత్రం. పూజారిని పలకరించేందుకు రోజూ కృష్ణుడు రాత్రి పూట రావడం.. అది కలో నిజమో తేల్చని దర్శకుడు.. చివరకు పూజారి ప్రతిజ్ఞను తమ్ముడు నెరవేర్చి రక్షిస్తాడు. నను పాలించగ నడిచి వచ్చితివా, తోటలోకి రాకురా తుంటరి తుమ్మెద, భూమ్మీద సుఖ పడితే తప్పు లేదురా, టాటా వీడుకోలు, గుడిలో ఏముంది బాబూ బడిలోనే వుంది వంటి పాటలన్నీ పేరు తెచ్చాయి. ఈ చిత్రంలో శ్రీకృష్ణుడుగా శోభన్‌బాబును అందంగా చూపించడం తర్వాత 'సంపూర్ణ రామాయణం'కు మొదటి మెట్టు.

అప్పట్లో బాగా జనాదరణ వున్న బాలనటుడు మాష్టర్ ప్రభాకర్‌తో తీసిన 'బాలరాజు కథ' (1970) బాగా హిట్టు. 'మహాబలిపురం మహాబలిపురం' అంటూ సాగే పాట గాని, అడిగానని అనుకోవద్దు చెప్పకుండ దాటేయొద్దు అంటూ దేవుడున్నాడా లేదా అని సాగే పాట బాగా పాపులర్. ఈ చిత్రం తర్వాత పిల్లల పెంపకం బావుండాలని చెప్పే 'ఇంటి గౌరవం' (1970) తీశారు. శోభన్ నాయకుడు ఆరతి నాయిక కాగా చంద్రమోహన్ దారి తప్పే కొడుకు. చివరకు అతన్ని తల్లే కాల్చేస్తుంది. మంచి చిత్రమే అయినా బాపు తరహాలో దీనికి పేరు రాలేదు.

1972 తర్వాత ఏడేళ్లు బాపు సినీ జీవితంలో సువర్ణాధ్యాయాలు. ఆ ఏడాది వచ్చిన 'సంపూర్ణ రామాయణం' బాపూ కళాసృజనకూ దర్శకత్వ ప్రతిభకూ విశ్వరూపం. తెలుగు ప్రేక్షకులకు రాముడుగా శోభన్‌బాబును చూపి ఒప్పించడమే గాక కనకవర్షం కురిపించారు బాపు. చిత్రం మొత్తం ఒక సంగీత భరిత రమణీయ దృశ్య కావ్యంగా చూపించి ఔరా అనిపించుకున్నారు. చాలా కాలం తర్వాత పి.బి.శ్రీనివాస్‌ను తీసుకొచ్చి 'వెడలెను కోడండపాణి' అనే నేపథ్య గీతాన్ని చిత్రమంతా పాడించారు. మరో రెండేళ్లలోనే మరణించనున్న ఎస్వీ రంగారావుతో రావణుని పాత్ర అపురూపంగా పండించారు. 'అందాల రాముడు' (1973) ముళ్లపూడి రాసిన జనతా ఎక్స్‌ప్రెస్ అనే గోదావరి పడవ ప్రయాణానికి చిత్రరూపంగా ధనవంతులకు అహంభావం తగదని సందేశమిస్తుంది. ఈ చిత్రంలోనే తెలుగులో తీతా (తీసేసిన తాసిల్దారు–అల్లు) అనే కొత్త పదం ప్రవేశించింది. 'శ్రీరామంజనేయ యుద్ధం' (1974) ఎన్టీఆర్‌ను నిగ్రహంగా నటింపచేయడమే గాక రఘురామయ్యతో పాడించడం విశేషమైంది.

బాపురే అనిపించిన బాపూ బొమ్మ 'ముత్యాల ముగ్గు'(1975). 'లవకుశ'కు మరో రూపమైన ఈ చిత్రం ఏ పెద్ద నటులు లేకుండానే అఖండ విజయం సాధించి అందరినీ అలరించింది. శ్రీధర్‌ను హీరోను చేసి, రావు గోపాలరావును గొప్ప విలన్‌గా మార్చి సంగీతను నాయికగా పరిచయం చేసింది.కాస్తంత కళాపోసన, ఆకాశంలో మర్డరు జరగడం, డిక్కీలో పడుకోబెట్టడం, ఆ ముక్క లెక్కట్టక ముందు చెప్పడం, ఎంతైద్ది వంటి అనేక శాశ్వత డవిలాగులను అందించింది. ఈ చిత్రంలోనూ హీరో కూతురికి ఆంజనేయుడు కనిపించడం నిజమో కాదో చెప్పడు. పాటలన్నీ హిట్ కావడం ఒకటైతే నిదురించే తోటలోకి పాట వొకటి వచ్చింది అంటూ గుంటూరు శేషేంద్ర శర్మ రచన ఒక ప్రయోగం. అదే ఏడాది విజయవారి 'రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్' తీశారు. మధ్యలోనే చక్రపాణి మరణించడం వల్ల మొత్తం బాపూనే చూడవలసి వచ్చింది. అయినా ఆయన పేరే వేసి తన వినయం ప్రదర్శించుకున్నారు. కొత్తనాయిక జయప్రదను చాలా అందంగా చూపించి భవిష్యత్తుకు పునాది పడేలా చేశారు. ఈ చిత్రంలోనూ హాస్యం, సంగీతం బావుంటాయి. హీరో కృష్ణంరాజు వ్యయ ప్రయాసలకోర్చి నిర్మించిన 'భక్త కన్నప్ప' కూడా అన్ని విధాల గొప్పగా విజయవంతమైంది.

బాపూ కళాసృజనకు పరాకాష్ట 'సీతాకళ్యాణం' (1976). కథ కన్నా చిత్రీకరణ సంగీతం నటీనటుల వ్యక్తీకరణ ప్రధానంగా వుండే ఈ చిత్రంలో సీతగా జయప్రదను చాలా బాగా చూపించాడు బాపు. 'కదిలింది కదిలింది గంగ..' అంటూ ఈ చిత్రంలో సాగే గంగావతరణ ఘట్టం ఒక క్లాసిక్. 'స్నేహం' (1977) ఒక పాతకాలపు హిందీ కథ ఆధారంగా తీశారు. ఇందులోనే రాజేంద్ర ప్రసాద్ పరిచయమయ్యాడు. కృష్ణంరాజు మరోసారి బాపుతో తీసిన విభిన్న చిత్రం 'మనవూరి పాండవులు'. మురళీ మోహన్ నాయకుడైనా పాండవులలో ఒకడైన చిరంజీవిని ప్రేక్షకులకు బాగా పరిచయం చేసింది.

వాణిశ్రీ, శ్రీధర్ జంటగా మోహన్ బాబు దుష్టపాత్రధారిగా, నటించిన 'గోరంత దీపం' (1978) దానికదే ఒక విలక్షణ చిత్రం. అమాయకుడైన భర్తకు తెలియకుండా తనను వేధించే అతని మిత్రుణ్ని, వంతపాడే ఇతర కుటుంబ సభ్యులను ఎదుర్కోవడానికి నాయిక చేసే పోరాటం కదిలిస్తుంది. వాణిశ్రీకి మేకప్ లేకుండా నల్లమ్మాయిగానే చూపిస్తూ ఒక మామూలు మహిళ నిస్సహాయతనూ నిప్పులు కక్కడాన్ని కూడా ఆమెతో అద్భుతంగా నటింపచేశారు బాపు. గోరంత దీపం, రాయినైనా కాకపోతిని, పాటలు చాలా ప్రజాదరణ పొందాయి. మోహన్ బాబు వందలాది చిత్రాల్లో నటించినా ఈ చిత్రంలో ఆయన రూపం, వాచకం కూడా చాలా భిన్నంగా వుండటం బాపు ముద్ర ఫలితమే. ఇప్పటి వరకూ వచ్చిన చిత్రాలన్నీ బాపూ ప్రత్యేకంగా సృష్టించిన కథలూ పాత్రలనుకుంటే తర్వాత వచ్చినవి రెండవ కోవకు చెందుతాయి.

'కలియుగ రావణాసురుడు' (1980) పేరుకు తగ్గట్టే దుర్మార్గుడికి పాఠం చెప్పే కథ. రాజాధిరాజు(1980) బైబిల్‌లోని సైతాన్ పాత్రకు రూపకల్పన చేసిన తొలి తెలుగు చిత్రం. ఈ చిత్రంలోని రాజ్యమూ బలమూ నీదే అన్న పాట పెద్ద హిట్టు. 'వంశవృక్షం' (1981) కన్నడం నుంచి రీమేక్. గిరీష్ కర్నాడ్ కథ గనక బ్రాహ్మణ్యం గురించిన కులాధిక్యత గురించి వుండే భ్రమలను పటాపంచలు చేస్తుంది. అనిల్ కపూర్–జ్యోతి– సోమయాజులు ప్రధాన పాత్రధారులుగా చాలా పట్టుగా నడిపిం చారు. 'తూర్పు వెళ్లే రైలు' (1979) హృద్యమైన ప్రేమకథ. అదే సమయంలో వర్షాల కోసం మహిళలను వివస్త్రలుగా వూరేగించే దురాచారాన్ని ఖండించిన చిత్రం.

తర్వాతి కాలంలో బాపూ తీసిన చిత్రాలు కొన్ని ఒక మోస్తరుగా విజయం సాధించినవైనా సరే పూర్వపు స్థాయిని చేరుకోలేకపోయాయి. 'ఏది ధర్మం ఏది న్యాయం, పెళ్లీడు పిల్లలు, మంత్రిగారి వియ్యంకుడు, సీతమ్మ పెళ్లి, బుల్లెట్, జాకీ, కళ్యాణ తాంబూలం...' వాటిలో వున్నాయి. కొన్ని మరీ చప్పగా సాగాయి. రాజేంద్ర ప్రసాద్‌తో తీసిన 'పెళ్లి పుస్తకం, మిస్టర్ పెళ్లాం' బాగా నడిచాయి. 'రాధా గోపాలం' మహిళల ఆత్మ గౌరవం గురించి చెబుతుంది. 'పెళ్లికొడుకు, రాంబంటు' (రాజేంద్ర ప్రసాద్ స్వంత చిత్రం) ఇలా వచ్చి అలా పోయాయి. ఎన్టీఆర్‌తో తీసిన 'శ్రీనాథ కవిసార్వభౌముడు' విజయం సాదించలేదు, ఆ పాత్ర ఆయనకు నప్పనూలేదు. చార్మితో తీసిన 'సుందరకాండ'పై చాలా ప్రచారం జరిగినా పల్టీకొట్టింది.

చివరగా మరోసారి 'లవకుశ' కథతో తీసిన 'శ్రీరామ రాజ్యం' బాపు ప్రతిష్టను కొంత వరకూ నిలబెట్టింది గాని అప్పటికే రమణ మరణించడం వల్ల ఆయన మానసికంగా ఉత్సాహం కోల్పోయారు.

స్వతహాగా చిత్రకారుడు కావడం వల్ల ప్రతి ఫ్రేమునూ బొమ్మ గీసి చూసుకోవడం, సంగీతంపై సంభాషణలపై ప్రత్యేక దృష్టి పెట్టడం, నటీనటులను సహజంగా చూపించడం, దృశ్యీకరణలో విభిన్నత ఇవన్నీ కలసిన బాపు నిస్సందేహంగా తెలుగు సినిమాను కొత్తమలుపు తిప్పారు. ఆయనకు ముందు ఆ తరహా వారు లేరు. తర్వాత కూడా ఇంత వరకూ రాలేదు.

- పీ పీ

◆ అట్టమీది కథ

సెల్ఫీ 'సరదా'!

- కె.ఎక్స్.రాజు

ఇటీవల సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తోన్న పదం... సెల్ఫీ. అతి తక్కువ సమయంలోనే ఈ సెల్ఫీ పెద్ద న్యూస్‌గా మారిపోయింది. ఈ పదం కొత్తగా అనిపించవచ్చు కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మొత్తం చిన్నా, పెద్ద, యువత సెల్ఫీ మానియాలో మునిగి తేలుతున్నారు. తొలుత ఇది పాశ్చాత్య దేశాలలో మొదలైంది. గత ఏడాది బాలీవుడ్ నటి ప్రియాంకా చోప్రా తన సెల్ఫీని సరదాగా ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసింది. అది మొదలు మనదేశంలోని అనేకమంది సినీ, స్పోర్ట్స్, రాజకీయ, ఇతర సెలెబ్రిటీలు తమ సెల్ఫీలను పోస్ట్ చేయడం మొదలెట్టారు. దీనికి తోడుగా ఇప్పుడు 'రెల్ఫీ' అనేది మొదలైంది. దీంతో ప్రతి సందర్భాన్నీ సోషల్ సైట్స్‌లో అప్‌లోడ్ చేయడం అలవాటుగా మారింది.

స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా పుణ్యమా అని ఈ సంస్కృతి మరింత వేగంగా పుంజుకుంటోంది. కెమెరా ఫోన్‌లు అందుబాటులోకి వచ్చిన తరువాత చాలా మంది తమను తామే ఫొటో తీసుకోవడం, ఆ ఫోటోను సోషల్ మీడియాలో, వాట్సప్‌లో పోస్ట్ చేయటం అనే పద్ధతి బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అంటే.. మన ఫొటోల్ని మనమే తీసుకొని పోస్ట్ చేయడం అన్నమాట. ఈ వ్యక్తీకరణ విధానాన్ని ఆంగ్లంలో సెల్ఫీ అంటున్నారు. డిజిటల్ కెమెరాతోగానీ, కెమెరా ఫోన్‌తో గానీ మనకు మనం తీసుకున్న సెల్ఫ్ పోర్ట్రెయిట్ ఫోటోగ్రాఫ్ అనే అర్థాన్నిచ్చారు. సింపుల్‌గా మనల్ని మనమే ఫోటోలు తీసుకోడాన్ని 'సెల్ఫీ' అంటారు. ఈ పదం డిక్షనరీలలో ఉండదు. అయితే ఈ ఏడాది కొత్తగా ప్రింట్ అయ్యే ఆంగ్ల నిఘంటువులలో ఈ మాట మనకు కనిపించే అవకాశాలున్నాయి. ఎందుకంటే, Selfie అనే మాటని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీ ప్రచురణ కర్తలు 2013 వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపిక చేశారు.

మనల్ని మనం ఫొటోలు తీసుకోవడమనేది వీడియో కాలింగ్‌తో స్టార్ట్ అయింది. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని నోకియా ఫ్రంట్ కెమెరాను పరిచయం చేయడంతో ఈ ధోరణి ఊపందుకుంది. ప్రస్తుతం సెల్ఫీల దూకుడు చూస్తుంటే.. కొన్ని రోజులకి మామూలు కెమెరాను కూడా మర్చిపోతామేమో అనేంతగా వుంది. దీనికి కారణం కూడా లేకపోలేదు. ఇప్పుడొస్తున్న స్మార్ట్‌ఫోన్లలో ఫ్రంట్ కెమెరా మెగాఫిక్సెల్ సైజు కూడా పెరుగుతూ వస్తోంది. తద్వారా క్వాలిటీ ఫొటోలను తీసుకునే అవకాశం వుంటుంది. దాంతోపాటు సెల్ఫీ స్టిక్ కూడా అందుబాటులోకి వచ్చింది. స్మార్ట్‌ఫోన్‌కు ఈ స్టిక్‌ను అనుసంధానించడం ద్వారా కావాల్సినంత దూరం, కావాల్సిన కోణంలో సెల్ఫీని తీసుకునే అవకాశం వుంటుంది. దీంతో ఫ్రంట్ కెమెరాకు గొప్ప క్రేజ్ తెచ్చిన ఈ ట్రెండ్ ఫొటోగ్రఫీకి కొత్త అర్థాలు చెబుతోంది. ఫ్రెండ్‌తో కలిసి బవార్చీలో బిర్యానీ తింటున్నా... అనో, ఫలానా టూరిస్ట్ స్పాట్‌లో విహరిస్తున్నామనో క్యాప్షన్ పెట్టి మరీ అప్పటికప్పుడు సెల్ఫీలను అప్‌లోడ్ చేయడం ట్రెండ్‌గా మారింది.

ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ ప్లస్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లన్నీ ఒకదానికొకటి పోటీపడి మరీ ఈ సేవలను అందిస్తున్నాయి. తమ అభిరుచులు, అనుభవాలు, ఆనందాలు, విషాదాలను అందరితో పంచుకుని తమను తాము ప్రత్యేకంగా వ్యక్తీకరిం చుకునేందుకు ఇప్పుడు ఎక్కువమంది ఎంచుకున్న దారి సెల్ఫీ.

ఒకప్పుడు ఫోటోలు దిగాలంటే మరొకరి సాయం తప్పనిసరి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ప్రతి ఒక్కరూ కెమెరామెన్ అయిపోతున్నారు. ఎవరికి వారే 'సెల్ఫీ'లు తీసేసుకుని, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో పెట్టేస్తున్నారు. మరీ ముఖ్యంగా సెలెబ్రిటీలకు ఇదో సరదా అయిపోయింది. ఎలాబడితే అలా సెల్ఫీలు తీసుకుంటూ తమ స్నేహితులకు చూపించుకుని సంబర పడిపోతుంటారు. మరికొందరు మామూలుగా జ్ఞాపకాల కోసం ప్రత్యేకంగా తీసుకుంటారు. అది సెలబ్రిటీలకే పరిమితం కాలేదు. స్మార్ట్‌ఫోన్ వున్న ప్రతి ఒక్కరూ ఈ పద్ధతి అనుసరిస్తున్నారు. దీంతో

ఫొటో షూట్స్‌లా కనిపించిన సోషల్ వెబ్‌సైట్లు ఇప్పుడు సెల్ఫీ ఫొటోలతో వినూత్నంగా దర్శనమిస్తున్నాయి. వింత అనుభూతులను కలిగిస్తున్నాయి. బైక్‌మీద వెళ్లేటప్పుడు, పడుకునేటప్పుడు, తినేటప్పుడు, విహార యాత్రలకు వెళ్ళేటప్పుడు.... ఇలా ఎవరి స్టైల్‌లో వారు అప్పటికప్పుడు సెల్ఫీ ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టేస్తున్నారు. ఇటీవల వచ్చిన "మనం" సినిమాలో చాలా చోట్ల ఈ సెల్ఫీల సన్నివేశాలు కనిపిస్తాయి. ఇలాంటి సన్నివేశాలు యువతరాన్ని చాలా త్వరగా ఆకర్షిస్తాయి. ఆ తరహా ఫోటోలను కూడా ఇప్పుడు ఫేస్‌బుక్ లాంటి సైట్లలో చూస్తున్నాము. అయితే ఈ సెల్ఫీలను సామాజిక చైతన్యం కోసం కూడా ఉపయోగించొచ్చని రుజువు చేశారు దీపా దేవేంద్ర, సాధనా సింగ్, దినేష్ శర్మ అనే హైదరాబాదీలు. వన్యప్రాణులను రక్షించాలనే సందేశంతో సిటీలోని చారిత్రక స్థలాలే వేదికగా 'సేవ్ వైల్డ్ అండ్ యానిమల్' నినాదాలతో సహా తీసుకున్న సెల్ఫీలను పోస్ట్ చేశారు. సెల్ఫీ క్రేజ్‌లో కొట్టుకుపోకుండా తొలిసారి మానవీయ కోణాన్ని ఆవిష్కరించారు.

అయితే ఇప్పుడు కొనసాగుతోన్న సెల్ఫీ ట్రెండ్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా సెల్ఫీలను షేర్ చేయడం వల్ల స్నేహితులు, బంధువులతో సన్నిహిత సంబంధాలు దెబ్బతింటాయని తాజాగా ఓ సర్వే వెల్లడించింది. బ్రిటిష్ పరిశోధకులు నిర్వహించిన ఈ సర్వే ప్రకారం... స్నేహితులతో తీసుకున్న సెల్ఫీలను ఎక్కువగా షేర్ చేస్తుండడం వల్ల భాగస్వామితో సంబంధాలు దెబ్బతింటాయని, స్నేహితుల నుంచీ లైక్స్ తగ్గుతాయని, పైగా సొంత ఫొటోలను ఎక్కువగా పెట్టుకునేవారిపట్ల చూసేవారికి నెగెటివ్ దృక్పథం ఏర్పడుతుందని ఆ సర్వే వెల్లడించింది.

ఇదొక భాగమైతే, సెల్ఫీల వల్ల అనేక అనర్థాలు కూడా జరుగుతున్నాయి. సెల్ఫీ అంటే సాధారణంగా క్లోజప్‌లుగా ఉంటున్నాయి. జంటలుగా తీసుకుంటున్న సెల్ఫీలు ఒక్కసారి చేయి దాటితే జీవితాలనే తలకిందులు చేయవచ్చునని ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన కొన్ని సంఘటనలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి ఈ సెల్ఫీల విషయంలో కాస్త సంయమనం పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత భద్రతను భంగపరిచేవి, మనం నివసించే పరిసరాలు, పరిస్థితులు పదే పదే ఇతరులకు తెలియజేయడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. పదుల సంఖ్యలో రోజూ సెల్ఫీలు తీసుకోవడం అలవాటైతే.. అది మానసిక వ్యాధిగా మారే ప్రమాదం కూడా ఉందంటున్నారు. సెల్ఫీ క్రేజ్ మహిళల్లోనే ఎక్కువని 'సెల్ఫిసిటీ' పేరుతో జరిగిన ఓ అంతర్జాతీయ సర్వేలో వెల్లడైంది. ముఖ్యంగా విదేశాల్లో న్యూడ్ సెల్ఫీల ట్రెండ్ ప్రమాదపు ఘంటికలు మోగిస్తోంది. ఇటీవల న్యూయార్క్‌లోని ఒక యూనివర్సిటీ చేసిన సర్వేలో న్యూడ్ సెల్ఫీలు పంపుకోవడం యువతకు క్రేజీగా మారిందని తేలింది.

టీనేజర్లు తమ నగ్న సెల్ఫీలు తీసుకుని పంపడం ఇటీవల బాగా ఎక్కువైపోతోంది. ఇది తల్లిదండ్రులతో పాటు టీచర్లను కూడా బాగా ఇబ్బంది పెడుతోందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఉటా చేసిన పరిశోధనలో తేలింది. విద్యార్థికి టాప్‌లెస్ సెల్ఫీని పంపిన బ్రిటీషు మహిళా టీచర్‌పై ఐదేళ్ల నిషేధం విధించారు.

అదే విధంగా సెల్ఫీ అలవాటు ముదిరితే మానసిక జాఢ్యంగా మారుతుందని మానసిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పందొమ్మిదేళ్ల బ్రిటిష్ యువకుడు డానీ బొవ్‌మన్ ఒకే రోజున 200 సెల్ఫీలు తీసుకున్నా.. తనకు నచ్చినట్లుగా సరైన ఫొటో రాక, మానసిక ఒత్తిడికి గురయ్యాడట. దీంతో ఆత్మహత్యకు కూడా యత్నించాడు. సెల్ఫీ అడిక్షన్‌కు గురైన తొలి యువకుడిగా ఇతడ్ని గుర్తించారు.

రెల్ఫీస్‌లో కొంత రిలీఫ్

సెల్ఫీ మేనియా పాతబడనే లేదు... మరో సరికొత్త ట్రెండ్ నెట్‌లో పాపులర్ అవుతోంది. అదే.. 'రెల్ఫీ'. ఎవరి ఫొటోలు వాళ్లే తీసుకుని ఎప్పటికప్పుడు సోషల్ మీడియా సైట్లలో సెల్ఫీలను పోస్ట్‌చేసే నెటిజన్లకు మొహంమొత్తినట్లే ఉంది. కొత్తదనం లేకుండా ఎప్పుడూ ఒకే రకమైన సెల్ఫీలను చూసేవారికీ విసుగొస్తుంది. కామెంట్స్, లైక్స్ తగ్గిపోతుంటాయి. ఈ సెల్ఫీ బాబులకు మాంచి ఖుషీనిచ్చేది ఈ కామెంట్లు, లైక్సేగా. ఇలాంటి పరిస్థితిని అధిగమించేందుకు కొందరు రిల్ఫీ పేరుతో నెట్‌లో హల్‌చల్ చేస్తున్నారు.

రెల్ఫీ అంటే...

సన్నిహితులు, కుటుంబ సభ్యులతో కలసి తీసుకునే సెల్ఫీనే ఇప్పుడు రెల్ఫీ అంటున్నారు. ఒంటరిగా కంటే జంటగానో, ఇంకా ఎక్కువమందితోనో తీసుకునే సెల్ఫీలను ఎవరైనా కాస్త ఆసక్తిగా చూస్తారు. వారు స్నేహితులు కావచ్చు, ప్రేయసీప్రియులు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, ఎవరైనా కావచ్చు. ఇలాంటి ఫొటోలనే రెల్ఫీ అంటారు. తరచూ రెల్ఫీలను

కోతి సెల్ఫీ

తొలి సెల్ఫీ

పోస్టు చేసే నెటిజన్లపై పాశ్చాత్య దేశాల్లో ఒక సర్వే నిర్వహించారు. ఈ రెల్ఫీలను పోస్టు చేసే వారి మధ్య సంబంధాలు బలంగా ఉన్నాయని ఆ సర్వేలో తేలింది. రెల్ఫీలను పోస్టు చేసేవారు తమ సంబంధాలను జాగ్రత్తగా కాపాడుకుంటారని కూడా ఆ సర్వే తేల్చింది. అంతేకాదు.. సెల్ఫీస్‌లో కొంత సెల్ఫిష్ కనిపిస్తుందని, రెల్ఫీస్‌లో కొంత రిలీఫ్ వుంటుందని వివిధ దేశాల నెటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. ఈ రెల్ఫీల కోసం ఏకంగా relfie.tumblr.com అనే వెబ్‌సైట్ కూడా పుట్టుకొచ్చింది.

1850లోనే తొలి సెల్ఫీ

ఈ మధ్య కాలంలో సెల్ఫీ బాగా పాపులర్ అయినప్పటికీ... తమ సొంత ఫొటోను తామే తీసుకోవడం అనేది ఇప్పటి వ్యవహారం కాదట. ఎప్పుడో 1850ల కాలం నుంచే ఉందని, ప్రపంచంలోని మొట్టమొదటి ఫొటోను ఆ సమయంలోనే తీశారని వెలుగులోకి వచ్చింది. ఆస్కార్ గుస్టేవ్ రెజ్లాండర్ అనే స్వీడిష్ విక్టోరియన్ ఆర్ట్ ఫొటోగ్రాఫర్ ఆస్కార్ రెజిలాండర్ ఈ సెల్ఫీ తీసుకున్నారు. అది ఇటీవలే నార్త్ యార్క్‌షైర్‌లోని హారోగేట్ ప్రాంతంలో గల మార్ఫెట్స్ వేలం శాలలో వేలానికి వచ్చింది. దాదాపు 69 లక్షల రూపాయలు వెచ్చించి ఓ కళా ప్రియుడు దీన్ని కొనుక్కున్నారు. దీని రిజర్వు ధరను కేవలం 9900 మాత్రమే పెట్టారని, అయితే అనుకోకుండా భారీ ధరకు వెళ్లిందని వేలం శాల వర్గాలు తెలిపాయి. ఆర్ట్ ఫొటోగ్రఫీకి ఆద్యుడిగా పేరొందిన రెజిలాండర్ ప్రచురించిన ఓ లెదర్ బౌండ్ పుస్తకంలో ఇది కూడా ఉంది. ఈ ఆల్బంలో ఆయన భార్య హల్లమ్ టెన్నీసన్ ఫొటో కూడా ఉంది.

లాంగెస్ట్ సెల్ఫీ కోసం

250మందితో ఉన్న ప్రస్తుత లాంగెస్ట్ సెల్ఫీ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడానికి ఐఐటీ ఢిల్లీ విద్యార్థులు సిద్ధమయ్యారు. వేయి మందితో లాంగెస్ట్

సెల్ఫీ ప్రపంచ రికార్డును సృష్టించాలని వారు ఉత్సాహ పడుతున్నారు. దీని కోసం ఒక ఫేస్‌బుక్ గ్రూప్‌ని ఏర్పాటు చేశారు. ఆసక్తి గల విద్యార్థులను లాంగెస్ట్ సెల్ఫీ ప్రపంచ రికార్డులో భాగస్వాములు కావాలని ఆహ్వానం పంపినట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికే వీరికి 3000 రిజిస్ట్రేషన్లు వచ్చాయట. ఈ క్రమంలో గిన్నిస్ బుక్ కొన్ని సూచనలు చేసింది. లాంగెస్ట్ సెల్ఫీలో పాల్గొనేవారు ఒక గ్రూప్‌గా ఏర్పడాలి. సిగ్నల్ అందగానే మొదటి వ్యక్తి తన పక్కనున్న వ్యక్తితో కలిసి ఒక సెల్ఫీ దిగాలి. వెంటనే రెండో వ్యక్తి, మూడో వ్యక్తితో కలిపి, మూడో వ్యక్తి నాలుగో వ్యక్తితో సెల్ఫీ దిగాలి. ఈ మాదిరిగా చివరి వ్యక్తి వరకు సెల్ఫీస్ దిగాలి. సెల్ఫీకి, సెల్ఫీకి మధ్య సమయం 60 సెకండ్లను మించకూడదు. మొదటి, చివరి వ్యక్తులు తప్ప మిగతా వారందరూ రెండు సెల్ఫీల్లోనూ కచ్చితంగా కనపడాలి.

సెల్ఫీ కాంటెస్ట్

సెల్ఫీలపై రోజురోజుకు పెరుగుతున్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని గ్రీన్‌ట్రెండ్స్ సెలూన్ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ జుట్టును స్టైలిష్‌గా డిజైన్ చేసిన ఓ సెల్ఫీని ఫేస్‌బుక్‌లో మైగ్రీన్ ట్రెండ్స్ పేజ్ ద్వారా సెల్ఫీ-లీషియస్ యాప్‌లో పోస్ట్ చేయాలి. ఎక్కువ లైక్‌లు వచ్చి టాప్-10లో నిలిచిన వారు గ్రీన్‌ట్రెండ్స్ సెలూన్ అందించే ఉచిత సేవలను పొందొచ్చు. మాదాపూర్‌లోని ఐల్యాబ్స్‌లో ఈ సెల్ఫీ-లీషియస్ కాంటెస్ట్‌ను అక్టోబర్‌లో నిర్వహించారు. దీంట్లో ఐల్యాబ్స్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని సెల్ఫీలను తీసుకోడంలో పోటీపడ్డారు. ఈ కాంటెస్ట్‌లో పాల్గొన్నవారిలో ఎక్కువ లైక్‌లు సంపాదించి టాప్-10లో నిలిచిన వారిలో

ప్రముఖుల సెల్ఫీలు

ఓటేసి.. సెల్ఫీ తీసుకున్న మోడీ

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని రాణిప్ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఇంకు మార్కు ఉన్న తన వేలిని సెల్ఫీ తీసుకుంటున్న నరేంద్ర మోడీ.

సెల్ఫీతో విమర్శలపాలైన ఒబామా

దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా మరణించినప్పుడు అంత్యక్రియలకు హాజరైన ఒబామా సహ దేశాధినేతలతో కలిసి సెల్ఫీలకు ఫోజులిచ్చి విమర్శలపాలయ్యారు. సంతాపం తెలియజేయడానికి వచ్చి ఫోటో సంబరాలు జరుపుకోవడం ఏమిటాని ప్రపంచం ముక్కున వేలేసుకోవాల్సి వచ్చింది. అదే ఇది.

మొదటి వ్యక్తికి ఏడాదిపాటు గ్రీన్‌ట్రెండ్స్ సెలూన్‌లో ఉచిత సేవలు పొందేందుకు అవకాశం కల్పించారు. మిగతా 9మంది 6నెలలపాటు సెలూన్ సేవలు ఉచితంగా పొందొచ్చు.

కోతి సెల్ఫీపై కాపీరైట్ యుద్ధం

ఇండోనేషియాకు చెందిన ఓ నల్లజాతి కోతి మూడేళ్ల కిందట సెల్ఫీ తీసుకొని సంచలనం సృష్టించింది. ఆ ఘటన మళ్లీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆ సెల్ఫీపై యాజమాన్య హక్కుల కోసం ప్రముఖ వెబ్‌సైట్ వికీపీడియా– ఓ ఫొటోగ్రాఫర్ మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోంది. తమ వెబ్‌సైట్ నుంచి సెల్ఫీని తొలగించడానికి వికీపీడియా నిరాకరిస్తోంది. ఈ సెల్ఫీపై కోతికి మాత్రమే యాజమాన్య హక్కులు ఉన్నాయని, ఫొటోగ్రాఫర్ డేవిడ్ స్లాటర్‌కు ఎలాంటి హక్కు లేదని వికీపీడియా వాదిస్తున్నది. ఇది ఓ జంతువు సొంతంగా చేసిన పని. దీనిపై మనిషికి ఎలాంటి కాపీరైట్స్ లేవు. అందుకే ఈ ఫొటోను మా పబ్లిక్ డొమైన్‌లో వాడుకుంటున్నాం అని వికీపీడియా సైట్ ఓ సందేశాన్ని పెట్టింది. అసలు విషయానికొస్తే... 2011లో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ డేవిడ్ స్లాటర్ అంతరించే ముప్పు ఎదుర్కొంటున్న నల్లరంగు జాతి కోతులను ఫొటో తీస్తుండగా.. అవి ఆయన కెమెరాను ఎత్తుకెళ్లాయి. దానితో వందల ఫొటోలు తీశాయి. వాటిలో ఇప్పుడు వివాదాస్పదంగా మారిన ఈ సెల్ఫీతోపాటు మరెన్నో ఫొటోలున్నాయి. నల్లరంగు కోతి సొంతంగా తీసుకున్న ఈ ఫొటో అనతికాలంలో ప్రపంచమంతటా ప్రాచుర్యం పొందింది.

ప్రాణాలు కాపాడిన సెల్ఫీ వీడియో

ఈ సెల్ఫీలు ఒక్కోసారి విసుగనిపిస్తుంది. కానీ, ఇలా సెల్ఫీ తీసుకోవడం ఓ మహిళ ప్రాణాలను నిలబెట్టింది. కెనడాలోని టొరంటోకు చెందిన స్టాసీ యెపెస్ (49) అనే మహిళ ఆఫీసులో పని ముగించుకుని ఇంటికి వెళ్తోంది. ఇంతలో ఆమెకు ఎడమవైపు చేతులు, కాళ్లు లాగేస్తున్నట్లు అనిపించింది. మాట కూడా సరిగా రావట్లేదు. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కూడా తన ఫోన్ తీసుకుని వెంటనే తనను తాను వీడియో తీసుకోవడం మొదలుపెట్టింది. తన ఎడమవైపు ముఖం లాగేస్తోందని, మాట ముద్దగా వస్తోందని చెప్పింది. తన ఎడమ చేతిని గానీ, కాలిని గానీ కదిలించలేకపోతున్నట్లు చూపించింది. ఎలాగోలా టొరంటో డౌన్‌టౌన్‌లోని మౌంట్ సినాయ్ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడి వైద్యులకు తన ఫోన్ ఇచ్చి, అందులో వీడియో చూడమని చెప్పింది. ఆమెకు ట్రాన్సియెంట్ ఇషెమిక్ ఎటాక్స్ వచ్చినట్లు వైద్యులు గుర్తించి, వెంటనే టొరంటో వెస్ట్రన్ ఆస్పత్రిలోని స్ట్రోక్ యూనిట్‌కు తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేయిస్తే ఆమె చెప్పిన విషయాలన్నీ సరైనవేనని తేలింది. ఇప్పటివరకు తమ వద్దకు ఇలాంటి రోగి రానే రాలేదని, రోగులు తమ రోగ లక్షణాలను చెప్పడానికి ఇంతకంటే మంచి మార్గం అస్సలు లేదని అక్కడి న్యూరాలజిస్టు షెరిల్ జైగోబిన్ చెప్పారు.

ప్రాణం మీదకు తెచ్చిన సెల్ఫీ మోజు

తమ జ్ఞాపకాలను పదిలపర్చుకోవడం కోసం ఫొటోలు తీసుకోవడం, తీయించుకోవడం వరకూ తప్పులేదు. కానీ మరీ దుస్సాహసాలు చేస్తూ సెల్ఫీలు తీసుకుంటే మాత్రం ప్రాణాలు బలైపోతాయని మెక్సికోలో జరిగిన ఈ తాజా సంఘటన రుజువు చేస్తోంది. 'మెక్సికన్ వెటర్నరీ డాక్టర్ అస్కార్ ఒటిరో అందిరిలాగే సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా కాలం గడిపేవాడు. అందమైన అమ్మాయిల్ని కౌగిలించుకుంటూ, మోటార్ బైక్స్‌పై విన్యాసాలు చేసుకుంటూ, రకరకాల విన్యాసాలతో నిత్యం సెల్ఫీలు తీసుకునేవాడు. ఈ నేపథ్యంలో బుల్లెట్లతో ఫుల్‌గా లోడెడ్ అయి వున్న ఒక తుపాకీని తలకు దగ్గరగా పెట్టుకుని ఫొటో దిగాలని సరదా పడ్డాడు. అయితే సెల్ఫీ తీసుకునే సరదాలో ఆ తుపాకీలో బుల్లెట్లు వున్నాయన్న సంగతిని మర్చిపోయి దానిని నొక్కేశాడు. ఇంకేముంది... బుల్లెట్ నేరుగా అతని తల్లోకి దూసుకుపోయింది. ఆసుపత్రికి తరలించేలోపే అతను ప్రాణాలు కోల్పోయాడు. చిన్న చిన్న సాహసాలు సరదాగానే వుంటాయి కానీ, మరీ ఇలా ప్రాణాల మీదకు తెచ్చే దుస్సాహసాలు మంచిది కాదు.

అదేపనిగా సెల్ఫీలు పోస్ట్ చేయొద్దు!

అదేపనిగా సెల్ఫీలు పోస్ట్ చేస్తున్నారా. అయితే ఈ అలవాటు మానుకోవడం మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సోషల్ వెబ్‌సైట్లలో ఎక్కువగా సెల్ఫీలు పోస్ట్ చేసే వారికి తమ సన్నిహితులు, కుటుంబ సభ్యులు, సహచరులు దూరమవుతారని పరిశోధనలో తేలిందని వారు వెల్లడించారు. సెల్ఫీలను సోషల్ మీడియాలో ఎక్కువగా షేర్ చేయడాన్ని సన్నిహిత స్నేహితులు, కుటుంబ సభ్యులు ఇష్టపడరని బర్మింగ్‌హామ్ బిజినెస్ స్కూల్ పరిశోధకుడు డేవిడ్ హౌగ్టన్ తెలిపారు. సెల్ఫీలను ఒకొకరు ఒక్కొక్క కోణంలో చూసి కామెంట్ చేస్తారని దీంతో అభిప్రాయ బేధాలు తలెత్తే అవకాశముందని వివరించారు.

ఇదండీ.... సరదాగా మొదలైన సెల్ఫీ విశేషాలతో నిండిన కథనం.

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

(భాగం -15)

సెప్టెంబర్ 1845 నుండి ఆగస్టు 1846 దాకా 'జర్మన్ అయిడియాలజీ' రచన కొనసాగించారు మార్క్స్, ఏంగెల్స్. అది రెండు సంపుటాల్లో అయిదు వందల పేజీల దాకా పెరిగింది. వాళ్ల మొదటి సమిష్టి కృషి 'ది హోలీ ఫ్యామిలీ' లాగా ఇందులో కూడా కొందరు వ్యక్తులను ఎద్దేవా చెయ్యటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. "ఇది రాస్తున్నప్పుడు, ఇద్దరు మిత్రులూ పలుసార్లు పగలబడి నవ్వటంతో ఇల్లంతా ప్రతిధ్వనించింది" అని గుర్తు చేసుకుంది లెంచెన్. కాని చివరికి మార్క్స్ కుటుంబానికి మిగిలింది వాళ్ల నవ్వులు మాత్రమే. జర్మనీలో ఎవరూ ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి ముందుకు రాలేదు. మార్క్స్ చెప్పినట్టుగా చివరికి దీన్ని 'ఎలుకలకు ఆహారంగా' వదిలేశారు. అయినప్పటికీ, మౌలిక ప్రయోజనం నెరవేరింది. సబ్జెక్టు గురించి వారికి స్పష్టత వచ్చింది.

1845 శిశిర కాలంలో, లారా పుట్టిన కొన్నాళ్లకే, మార్క్స్ కుటుంబంలో ఆందోళన మొదలైంది. బెల్జియం నుండి కూడా మార్క్స్‌ను బహిష్కరించడానికి ప్రష్యా ప్రయత్నిస్తున్నదని వార్తలు వచ్చాయి. బ్రసెల్స్‌లో జర్మన్‌ల జనాభా పెరిగింది. ఇందులో కొందరు ప్రష్యన్ ప్రభుత్వ గూఢచారులేననటంలో సందేహం లేదు. అప్పటికి మార్క్స్ బెల్జియన్ ఆదేశాలనేమీ ఉల్లంఘించలేదు. బహుశా రాడికల్ శరణార్థులకు అతడు కేంద్రంగా వున్నాడని గూఢచారులు నివేదికలు పంపించి వుంటారు.

" జెన్నీ పక్కన లేదు. చిక్కులు పెరిగాయే తప్ప తగ్గలేదు. ఎంగెల్స్ కూడా సమస్యలతో సతమతమవుతున్నాడు. అప్పటికి మేరీ బర్న్స్ ఆయన వద్ద ఆర్నెల్లుగా ఉంటోంది. మార్క్స్, ఎంగెల్స్ కుటుంబాలు సన్నిహితంగా వున్నప్పటికీ (నిజానికి రెండు కుటుంబాలూ కలిసే ఉంటున్నాయి) మార్క్స్, జెన్నీలు, ఎంగెల్స్ గురించి పెద్దగా పట్టించుకున్నట్టు లేదు. ఎంగెల్స్, మేరీని వివాహం చేసుకోకకపోవటం వల్ల జెన్నీ ఆమెను దూరంగా పెట్టి ఉంటుందని కొందరు చరిత్రకారులు అభిప్రాయం. కాని అది అసలు కారణం కాకపోవచ్చు. మోజెస్ హెస్ కూడా తన సహచరిని వివాహం చేసుకోలేదు. మార్క్స్ దంపతులు పారిస్‌లో వివాహం కాని జంటలనేకం చూశారు. "

ఇలాంటి వాళ్లందరూ తమ సరిహద్దులకు ఎంత దూరంగా వుంటే ప్రష్యాకంత క్షేమం. తాను ప్రష్యన్ పౌరునిగా వున్నన్నాళ్లూ ఈ చిక్కులు తప్పవని డిసెంబర్ 1845లో తన (ప్రష్యన్) పౌరసత్వాన్ని వదులుకున్నాడు మార్క్స్.

అంటే యిప్పుడతడు ఏ దేశానికీ చెందడు. నిజానికి దీనివల్ల అతనికి అదనంగా జరిగిన నష్టమేమీ లేదు. ఒకవేళ ప్రష్యా వెళ్లటమంటూ జరిగితే, అతన్ని అక్కడ అరెస్టు చెయ్యటం ఖాయం. అయితే, ఏ ఒక్క దేశానికీ చెందిన వాణ్ణి కాదనుకోవటంలో ఒక విముక్తి భావన వుంది. 1846 ప్రారంభంలో మార్క్స్, ఎంగెల్స్, మరికొందరు మిత్రులు కలిసి 'కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ' ఏర్పాటు చేశారు. దీని

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

లక్ష్యం కార్మికులు, సోషలిస్టుల మధ్య సరిహద్దుల్ని చెరిపెయ్యటం. అవకాశం వచ్చినప్పుడు అందరూ కార్యాచరణకు సిద్ధంగా వుండాలి. ఇప్పుడు సెన్సార్ల బెడద లేకుండా న్యూస్ లెటర్స్ పంపించుకోవచ్చు.

ఇది (కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ) చాలా చిన్న సంస్థ. వాళ్లు చేసిన పని కూడా ఎక్కువేమీ కాదు. కాని మార్క్స్ ఏర్పాటు చేయాలనుకున్న అంతర్జాతీయ సంస్థలకిది తొలి దశ. ఆఫీసు వ్యవహారాలు జెన్నీ చూసుకుంది.

ఆమె పని ఎవరికీ అర్థం కాని మార్క్స్ దస్తూరికి సాపు ప్రతి రాయటం (ఆయన జీవిత కాలంలో జెన్నీ, ఎంగెల్స్, మార్క్స్ కూతుళ్లు మాత్రమే ఆ చేతిరాతను చదవగలిగే వారట!). మార్క్స్‌తో ఎంగెల్స్ సమిష్టి కృషి కొనసాగింది. కుటుంబ సభ్యులు కూడా కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ కాలంలో మార్క్స్ కేవలం రోజుకు నాలుగు గంటలు మాత్రమే నిద్రపోగలిగారు. జెన్నీ స్నేహితురాలొకావిడ "anti 3 or 4 o'clock - in the morning association" ఏర్పాటు చెయ్యమని సూచించింది. కనీసం ఈ సమయంలోనైనా విప్లవ కార్యకలాపాలాపి విశ్రాంతి తీసుకోవాలని ఆమె ఉద్దేశం. ఇది మంచి సలహా. అప్పటికే మార్క్స్, ఎంగెల్స్ ఇళ్లలో అందరూ చికాకు పడుతున్నారు. జెన్నీ జబ్బుగా వున్న తల్లిని చూడటానికి ట్రేసర్ వెళ్లినప్పుడు ఈ సమస్య మరింత తీవ్రమైంది. మార్క్స్ రెండు పుస్తకాలు రాస్తున్నాడు. అవిగాక, కొత్త రాజకీయ సంస్థ వ్యవహారాలు చూసుకోవాలి. జర్మన్ శరణార్థులందరూ ఎప్పుడూ అక్కడే కూర్చుంటారు. ఇంకా మూడేళ్లయినా నిండని పిల్లల్ని చూసుకోవాలి. ఈ బాధ్యత లెంచెన్‌దే కావచ్చు గాని మార్క్స్ అవసరాలు పట్టించుకోవటానికెవరూ లేరా ఇంట్లో.

మార్చి 30 నాడు ఇంట్లో కమిటీ మీటింగ్ జరిగింది. విలియం వేట్లింగ్ అనబడే ఒక దర్జీ ఆనాడు వేదిక మీద మాట్లాడాలి. సోషలిస్టులలో, కమ్యూనిస్టులలో అతనికి మంచి పేరుంది. మధ్య తరగతి మేధావులను నమ్మని వాళ్లకు అతడే ఆదర్శం. పారిస్‌లో 'లీగ్ ఆఫ్ జస్ట్' సహ సంస్థాపకుడు. రహస్యంగా ప్రచురితమైన "మానవ జాతి ఎలా వుంది? ఎలా వుండాలి?" పుస్తకం రాసిందీయనే. అయితే అతను ఊహాజనిత సోషలిస్ట్. కొంతకాలం జైళ్లలో గడపటం కూడా కారణం కావచ్చు. అతడు వాస్తవాలకు దూరంగా వున్నాడని మార్క్స్ అభిప్రాయం. సమావేశం ప్రారంభం కాగానే అప్పటి దాకా ఏదో ఆలోచిస్తూ కూర్చున్న మార్క్స్ 'ఉపన్యాసాలు సరే. ఇన్నాళ్లూ మీరు జర్మనీలో చేసిందేమిటో చెప్పండి" అంటూ నిలదీశాడు. కార్మికులకు తమ దైన్య స్థితిని గురించి అవగాహన కలిగించానంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు వేట్లింగ్.

మార్క్స్ మధ్యలోనే అడ్డు పడి, "కార్మికులకు అరచేతిలో స్వర్గం చూపించటం నిజాయితీ అనిపించుకోదు. నీకు నువ్వు ప్రవక్తవనుకుంటే సరిపోదు. నువ్వు మాట్లాడుతుంటే వాళ్ల చేతులు జోడించి నీ వైపు ఆశగా చూడాలా! వాళ్ల పరిస్థితి దయనీయంగా వుందని మళ్లీ మళ్లీ చెప్పనక్కర్లేదు. వాళ్లకూ తెలుసా విషయం. వాళ్ల పరిస్థితికి కారణాలు విశ్లేషించగలగాలి. కార్యాచరణ ఏమిటో స్పష్టం చేయకపోగా వాళ్లను రెచ్చగొట్టడం చాలా ప్రమాదకరం" అంటూ అరిచాడు. వేట్లింగ్ సంజాయిషీ ఇచ్చుకోవటానికి ప్రయత్నించాడు గాని మార్క్స్, బల్లమీద బలంగా గుద్దుతూ (బల్లమీద దీపం పడిపోయేదే!) "అజ్ఞానం వల్ల ఎవరికి ఉపయోగం!! అంటూ ఉరిమి చూశాడు. అందరూ నిశ్శబ్దంగా నిష్క్రమించారు. కాసేపటికి మార్క్స్ కూడా లేచి గదిలో అటూయిటూ పచార్లు చేస్తూ గడిపాడు.

కోపంతో ఊగిపోతున్నాడు. అగ్ని పర్వతంలోంచి లావా ఉబికి రావటానికి సిద్ధంగా వుంది. ('పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేస్తాడు మార్క్స్' అంటూ వ్యాఖ్యానించాడొక మిత్రుడు) కొద్ది రోజులలోనే తన బృందంలోని ఒక జర్మన్ జర్నలిస్ట్ హెర్మాన్ క్రీజ్ మీద దాడి చేశాడు మార్క్స్". సెంటిమెంటల్ యుటోపియన్. ఒక చిన్న వ్యాసంలో ముప్ఫై అయిదుసార్లు 'ప్రేమ' అనే మాట వాడకుండా ఉండలేడు" అన్నాడు. ఆ తర్వాత పలువురు ఫ్రెంచి, జర్మన్ గొర్రె దాటు సోషలిస్టులను ఘాటుగా విమర్శిస్తూ కరపత్రాలు ముద్రించాడు. వీళ్లెవరికీ శాస్త్రీయ దృష్టి లేదు. నిజమైన సమస్యలను పరిష్కరించే దారులు వెదకటంలో విఫలమయ్యారు". మాంచెస్టర్‌లో తాను చూసిన దృశ్యాలు ఇంకా కళ్ల ముందర కదలాడుతున్నాయి. మాటలు కాదు. ఉపన్యాసాలు కాదు. పగటి కలల్లో విహరించటం కాదు, సైద్ధాంతిక చర్చలు కాదు. తక్షణ కార్యాచరణ కావాలి. విప్లవం తప్ప మరో మార్గం లేదు.



ఫిబ్రవరి నెలలో పోలెండ్‌లోని గలీషియాలో రైతులు తిరుగుబాటు చేసి వందలాది అగ్రవర్గాల వారిని హతమార్చారు. మార్క్స్‌కు ఇందులో ఓ ఆశాకిరణం కనిపించింది. చరిత్ర గతి ఇలాగే ఉండబోతోంది. ఇది తొలి విప్లవ కెరటం. తిరుగుబాటు క్రాకోకు పాకింది. ఆ పోలిష్ విప్లవంలో అర్థబానిస విధానం రద్దయినట్టుగా ప్రకటించారు. కాని పది రోజుల తర్వాత తిరుగుబాటు విఫలమైంది. సంస్థాగత నిర్మాణం లేకపోవడం దానికి ముఖ్య కారణం. మార్క్స్ ఇన్నాళ్లూ నొక్కి చెబుతున్నదదే. చరిత్ర గురించిన స్పష్టమైన అవగాహన లేకుండా ఏ విప్లవమూ విజయం సాధించలేదు. కూకటివేళ్లతో పెళ్లగించిన పాత వ్యవస్థ స్థానంలో రాబోయే కొత్త వ్యవస్థ ఎలా వుండబోతోందో అన్న స్పష్టమైన అవగాహన వుండాలి.

గలీషియా తిరుగుబాటు అంతటితో సమసిపోలేదు. దాని ప్రభావం ప్రతి యూరోపియన్ రాజధానిలోనూ ప్రతిధ్వనించింది. ఆహార కొరత, ఆర్థిక సమస్యలతో, ప్రభుత్వాలను నిలదీశారు ప్రజలు. నిరుద్యోగం పెరిగింది. మార్క్స్‌కు తన కరెస్పాండెన్స్ కమిటీలో చిక్కులు పెరిగాయి. ఇతర దేశాలలో జరుగుతున్న పరిణామాలను తెలియచెప్పే 'విలేకరులు' దొరకలేదు. ఫ్రాన్సు గురించి ప్రూధోను రాయమన్నాడు కాని ఊహించినట్టుగానే అయన సహకరించలేదు.

జెన్నీ పక్కన లేదు. చిక్కులు పెరిగాయే తప్ప తగ్గలేదు. ఎంగెల్స్ కూడా సమస్యలతో సతమతమవుతున్నాడు. అప్పటికి మేరీ బర్న్స్ ఆయన వద్ద ఆర్నెల్లుగా ఉంటోంది. మార్క్స్, ఎంగెల్స్ కుటుంబాలు సన్నిహితంగా వున్నప్పటికీ (నిజానికి రెండు కుటుంబాలూ కలిసే ఉంటున్నాయి) మార్క్స్, జెన్నీలు, ఎంగెల్స్ గురించి పెద్దగా పట్టించుకున్నట్టు లేదు. ఎంగెల్స్, మేరీని వివాహం చేసుకోకపోవటం వల్ల జెన్నీ ఆమెను దూరంగా పెట్టి ఉంటుందని కొందరు చరిత్రకారులు అభిప్రాయం. కాని అది అసలు కారణం కాకపోవచ్చు. మోజెస్ హెస్ కూడా తన సహచరిని వివాహం చేసుకోలేదు. మార్క్స్ దంపతులు పారిస్‌లో వివాహం కాని జంటలనేకం చూశారు. వాళ్లతో కలిసి తిరిగారు. మరికొందరు

" సెప్టెంబర్ 1845 నుండి ఆగస్టు 1846 దాకా 'జర్మన్ అయిడియాలజీ' రచన కొనసాగించారు మార్క్స్, ఏంగెల్స్. అది రెండు సంపుటాల్లో అయిదు వందల పేజీల దాకా పెరిగింది. వాళ్ల మొదటి సమిష్టి కృషి 'ది హోలీ ఫ్యామిలీ' లాగా ఇందులో కూడా కొందరు వ్యక్తులను ఎద్దేవా చెయ్యటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. "ఇది రాస్తున్నప్పుడు, ఇద్దరు మిత్రులూ పలుసార్లు పగలబడి నవ్వటంతో ఇల్లంతా ప్రతిధ్వనించింది" అని గుర్తు చేసుకుంది లెంచెన్. కాని చివరికి మార్క్స్ కుటుంబానికి మిగిలింది వాళ్ల నవ్వులు మాత్రమే. జర్మనీలో ఎవరూ ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి ముందుకు రాలేదు. మార్క్స్ చెప్పినట్టుగా చివరికి దీన్ని 'ఎలుకలకు ఆహారంగా' వదిలేశారు. "

జెన్నీ, మేరీ కన్నా తాను (సామాజికంగా) పున్నతురాలినని అనుకుని వుంటుందని అన్నారు. కాని ఆమెకు అలాంటి వర్గ స్వభావం లేదన్నారు మరికొందరు. మొత్తంమీద కారణమేదైనా మార్క్స్ దంపతులకామె నచ్చలేదు. ఇక వాస్తవానికొస్తే ఇరవై మూడేళ్ల ఐరిష్ ఫ్యాక్టరీ కార్మికుని కూతురికీ, ముప్పై రెండేళ్ల ప్రష్యన్ అరిస్టోక్రాట్‌కూ మధ్య అగాధం పూడ్చటం అంత సులభమేమీ కాదు. ఒక సందర్భంలో "ఎంగెల్స్ కోరుకొంటే, విముక్తిని కోరుకుంటున్న అందమైన ఆడపిల్లలెందరో రెడీగా వున్నారు" అంది జెన్నీ. జెన్నీ బ్రేయర్‌లో వున్న సమయంలో ఎంగెల్స్, మేరీల మధ్య ఏదో గొడవ జరిగిన మాట నిజం. ఆమె కొంతకాలం ఇంగ్లండ్ విడిచి వెళ్లింది.

బ్రసెల్స్‌లోని శరణార్థి బృందాలలో కూడా గొడవలు ప్రారంభమయ్యాయి. మొదటి

" కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ చాలా చిన్న సంస్థ. వాళ్లు చేసిన పని కూడా ఎక్కువేమీ కాదు. కాని మార్క్స్ ఏర్పాటు చేయాలనుకున్న అంతర్జాతీయ సంస్థలకిది తొలి దశ. ఆఫీసు వ్యవహారాలు జెన్నీ చూసుకుంది. ఆమె పని ఎవరికీ అర్థం కాని మార్క్స్ దస్తూరికి సాఫు ప్రతి రాయటం (ఆయన జీవిత కాలంలో జెన్నీ, ఎంగెల్స్, మార్క్స్ కూతుళ్లు మాత్రమే ఆ చేతిరాతను చదవగలిగే వారట!). మార్క్స్‌తో ఎంగెల్స్ సమిష్టి కృషి కొనసాగింది. కుటుంబ సభ్యులు కూడా కమ్యూనిస్ట్ కరెస్పాండెన్స్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. "

సంవత్సరంలో వున్న సఖ్యత ఇప్పుడు కొరవడింది. మార్క్స్, వెట్లింగ్ పట్ల ప్రదర్శించిన ఆగ్రహానికి నిరసనగా, పార్టీతో సంబంధం తెంచుకుంటానన్నాడు (మార్క్స్ అందరూ తనకు అణిగిమణిగి వుండాలనుకుంటాడు" అని ఆరోపించాడు కూడా). ఎవరి దగ్గిరా డబ్బుల్లేవు – మార్క్స్ పరిస్థితి మరీ అధ్వాన్నం. పుస్తకాన్ని ప్రచురిస్తానన్న ఒక పబ్లిషర్, ఎంతకూ అది పూర్తికాకపోవటంతో, ఆ పుస్తకాన్ని మారెవరితోనన్నా ప్రచురణ చేయించుకుని, తానిచ్చిన 1500 ఫ్రాంకుల అడ్వాన్సు తిరిగి ఇచ్చెయ్యమని లేఖ రాశాడు (ఈ విషయాలేవీ మార్క్స్, జెన్నీకి చెప్పినట్టు లేదు. ఆమె అమాయకంగా, పుస్తకం కోసం జర్మనీలో ఆతృతగా ఎదురు చూస్తున్నారని భర్తకు రాసింది). ఆశ్చర్యమేమంటే, ఎంగెల్స్ కూడా డబ్బు ఇబ్బందుల్లో వున్నాడు. 150 ఫ్రాంకుల విలువ గల వస్తువులు తాకట్టు పెట్టాననీ, డబ్బు త్వరగా పంపిస్తే వాటిని విడిపించుకుంటాననీ తన బావమరిదికి ఓ లేఖ రాశాడు.

'జర్మన్ అయిడియాలజీ'ని జర్మనీలో ప్రచురించటానికి ప్రయత్నిస్తున్న వైడెమీయర్‌కు "రోజులు గడవటం కష్టంగా వుంది. నా దగ్గర వున్న బంగారం, వెండి, దుస్తులు కూడా కుదవపెట్టాను" అని లేఖ రాశాడు మార్క్స్. కాని అంతకన్నా తక్షణ సమస్య మరొకటి వచ్చి పడింది. ఇంటి లీజు ముగిసింది. మరో ఇంటికి మారటానికి డబ్బు లేదు. గత్యంతరం లేక ఎంగెల్స్ వుంటున్న బోర్డింగ్ హౌజ్‌కు మారాడు. కష్టాలు రోజురోజుకూ పెరిగాయే తప్ప తగ్గలేదు.

అయినా మార్క్స్ తన రాడికల్ పథం నుండి పక్కకు మళ్లలేదు. జీవితంలో అలాంటి భావన కూడా ఆయనకెప్పుడూ రాలేదు. డబ్బు లేదు. దొరుకుతుందన్న ఆశలేదు. కొలోన్‌లోని కొందరు వ్యాపారస్తుల్ని అడిగితే ఎంతో కొంత సాయం చెయ్యకపోరు. (కాని రాజకీయ కారణాల రీత్యా వాళ్ల ముందు చేయి చాచటం మార్క్స్‌కు ఇష్టం లేదు). హెస్, ఇతర్లు కూడా ఆదుకునే స్థితిలో లేరు. సరిగ్గా అప్పుడే ఏప్రిల్ 1846లో ఆపన్నహస్తం అందించారొకరు. అనూహ్యంగా ముప్పై ఏడేళ్ల విల్హెం వూల్ఫ్ (లూపస్) ఒకనాడు తలుపు తట్టాడు. పత్రికా చట్టాన్ని ఉల్లంఘించినందుకు అరెస్టయ్యేవాడే కాని తప్పించుకుని వచ్చాడు.

....

మార్క్స్ అంకుల్, లయన్ ఫిలిప్, జెన్నీ తల్లి ఇచ్చిన డబ్బుతో మరో మంచి ఇంటికి మారారు మార్క్స్ దంపతులు. జెన్నీ ఏడు నెలల గర్భవతి.

మార్క్స్ చేతి రాత



తన మూడవ ప్రసవం బోర్డింగ్ హౌజ్‌లో జరగటం ఆమెకిష్టం లేదు. మార్క్స్ రచనల నుండి డబ్బు వస్తుందన్న ఆశ లేదు. తన ఆర్థిక శాస్త్ర గ్రంథం ముగించాడు గాని తిరగ రాయాల్సి వుందన్నాడు మార్క్స్. 'జర్మన్ అయిడియాలజీ'కి ప్రచురణకర్త దొరకలేదు.

ప్రూధో తన ప్రతిపాదనను తిరస్కరించనప్పటి నుండీ, అతడి మీద కోపంగా వున్నాడు మార్క్స్. ఒకప్పుడు అతణ్ణి కీర్తించిన మాట నిజమేగాని, కొంతకాలంగా అందరి ఊహాజనిత సిద్ధాంతాలనూ ఖండిస్తూ, తన శాస్త్రీయ విశ్లేషణలో ముందుకు సాగుతున్నాడు. ఆ క్రమంలో ఇంకా మిగిలిన ముఖ్య ఆర్థిక శాస్త్రవేత్త ప్రూధో ఒక్కడే. తను రాసిన 'ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ'తో తనే మార్క్స్‌కు విమర్శించే అవకాశం కల్పించాడాయన. మార్క్స్‌కు డిసెంబర్, 1846లో చేరిందీ పుస్తకం. 'రచయిత ఆర్థిక, చారిత్రక అభివృద్ధి క్రమం అర్థం చేసుకోలేదు' అన్నాడు మార్క్స్. అతడి వాదనలకు ఆధారం 'వాస్తవాలు' కాదు. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి.

సశేషం

▪ ఫోన్: 91776 18708



లిటిల్ స్టార్

కృష్ణుడిగా, రాముడిగా ఓ వెలుగు వెలిగిన నటుడు ఎన్టీవోడు. తనదైన శైలిలో డైలాగులు చెప్తూ... విలన్ నుంచి హీరోగా ఎదిగిన నటుడు మోహన్‌బాబు. ఈ ఇద్దరి మధ్య మిణుకుమిణుకు మంటున్న ఆ చిన్ని తార ఎవరో గుర్తుపట్టారా? ఓ క్లూ ఇస్తే ఏమైనా గుర్తించగలరేమో చూడండి. 'మేజర్ చంద్రకాంత్' చిత్రం షూటింగ్ సందర్భంగా తీసినదీ ఫోటో. ఏంటీ ...ఇప్పటికైనా వెలిగిందా? జవాబు కోసం ... 24వ పేజీ చూడండి.

ఇడ్లీలు ఇలా కూడా...

కూరగాయల ఇడ్లీ

కావల్సినవి :
ఇడ్లీ పిండి – నాలుగు కప్పులు, క్యారెట్లు – నాలుగు (ముక్కలు తరగాలి). బీన్స్–ఆరు, పచ్చి బఠాణీలు–పావుకప్పు, ఉల్లిపాయలు తరుగు–పావుకప్పు, పచ్చి మిర్చి–రెండు, మినప్పప్పు–అరచెంచా, ఆవాలు, జీలకర్ర–పావు చెంచా చొప్పున, కరివేపాకు–కొద్దిగా, ఉప్పు–రుచికి తగినంత, నూనె–చెంచా.

తయారు చేసే విధానం:
క్యారెట్ ముక్కలు, బీన్స్, పచ్చి బఠాణీలు అన్నీ కలిపి ఉడికించుకోవాలి. తరువాత బాణలిలో నూనె వేసి ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి వేసి వేగాక ఉల్లిపాయ ముక్కలు చేర్చాలి. అవి మగ్గాక ఉడికించిన ముక్కలు, బఠాణీలు, ఉప్పు వేసి మూత పెట్టాలి. కొద్దిసేపయ్యాక దించేస్తే సరిపోతుంది. చల్లారాక ఇడ్లీ పిండిలో ఈ కూరను వేసి బాగా కలియతిప్పాలి. తరవాత ఇడ్లీ ప్లేట్లకు నూనె రాసి పిండిని వేసి ఆవిరిమీద ఉడికించాలి. ఇలా తయారయిన వేడివేడి ఇడ్లీని కొబ్బరి చట్నీతో తింటే ఎంతో రుచిగా ఉంటాయి.

జొన్న రవ్వ ఇడ్లీ

కావల్సినవి :
మినపపిండి (రుబ్బినది)–ఒక కప్పు, జొన్న రవ్వ–రెండు కప్పులు, పెరుగు–పావుకప్పు, ఆవాలు–టీ స్పూను, జీడిపప్పు పలుకులు–పది, నూనె–సరిపడా, ఉప్పు–తగినంత, నీళ్లు –సరిపడా.

తయారు చేసే విధానం:
ముందుగా జొన్నరవ్వని వేయించి పక్కన పెట్టుకోవాలి. పొయ్యిమీద గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి ఆవాలు, జీడిపప్పు వేయించుకోవాలి. ఇందులో మూడు కప్పుల నీళ్లు పోసి మరుగుతుండగా జొన్నరవ్వ వేసి కలపాలి. సగం ఉడికాక దించేయాలి. ఇందులో రుబ్బిన పిండి, ఉప్పు వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. చల్లారిన తర్వాత ఈ పిండితో ఇడ్లీలు వేసుకుంటే చాలా రుచిగా ఉంటాయి. అయితే జొన్నరవ్వ బాగా సన్నగా ఉండేలా చూసుకోవాలి.

పాలక్ కార్న్ ఇడ్లీ

కావల్సినవి : ఇడ్లీపిండి (మినపప్పు ఇడ్లీ రవ్వ కలిపి పెట్టుకున్న మిశ్రమం) – రెండు కప్పులు, పాలకూర ముద్ద – రెండు టేబుల్ స్పూన్లు, స్వీట్ కార్న్ గింజలు – నాలుగు టేబుల్ స్పూన్లు, తినే సోడా – కొద్దిగా, ఉప్పు – తగినంత, నీళ్లు – సరిపడా.

తయారు చేసే విధానం : ముందుగా పాలకూరని శుభ్రంగా కడిగి నూనెలో వేయించి రుబ్బుకోవాలి. ఇందులో ఇడ్లీ పిండి, స్వీట్ కార్న్ గింజలు,ఉప్పు, కొద్దిగా నీళ్లు పోసి బాగా కలుపుకోవాలి. ఈ పిండితో ఇడ్లీలు తయారు చేసుకోవాలి. అల్లం పచ్చడి లేదంటే కొబ్బరి పచ్చడితో తింటే చాలా రుచిగా ఉంటాయి.

సేమియా ఇడ్లీ



కావల్సినవి : ఇడ్లీ పిండి – రెండు కప్పులు, సేమ్యా–అరకప్పు, క్యారెట్ ముక్కలు– పావు కప్పు, ఉల్లిపాయ ముక్కలు–ఒక టేబుల్ స్పూను, పచ్చి మిరపకాయ ముక్కలు – ఒక టేబుల్ స్పూను, ఉప్పు–తగినంత, నూనె–సరిపడా.

తయారు చేసే విధానం: పొయ్యిమీద గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి బాగా కాగాక పచ్చి మిరపకాయ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, క్యారెట్ ముక్కలు వేసి బాగా వేగించాలి. తరువాత ఒక కప్పు నీళ్లు పోసి మరిగించాలి. చివర్లో ఉప్పు, సేమ్యాలు వేసి ఉడికించి దించేయాలి. ఇందులోని ఇడ్లీ పిండి వేసి బాగా కలుపుకుని ఇడ్లీలు వేసుకోవాలి. ఈ సేమ్యా ఇడ్లీలను పిల్లలు బాగా ఇష్టపడతారు.

ఏమేం వున్నాయి?

చిన్నారులూ! ఈ ఫొటో చూస్తుంటే ఏమనిపిస్తుంది?
కొన్ని జంతువుల శరీరభాగాలను అతికిస్తే ఈ వింత జంతువు తయారైనట్టుగా కదూ.
ఇంతకీ ఆ జంతువులు ఎన్ని? ఏమేంటి?

జవాబు: ఏనుగు, ఒంటె, ఆవు, జీబ్రా.

చుక్కల్లో చిక్కినదెవరోచ్?



బుజ్జాయిలూ... ఇక్కడ బోలెడన్ని చుక్కలు కనిపిస్తున్నాయా!
వీటిలో ఎవరో చిక్కుకున్నారంట. అదెవరో తెలియాలంటే.....
1 నుంచి 55 వరకు చుక్కలను వరుసగా కలిపేయండే.
మరి ఆలస్యమెందుకంట?

డాల్ఫిన్ డాబులు

పిల్లలూ! ఇవాళ మీకు ఎంతో ఇష్టమైన జంతువు మీ ముందుకొచ్చింది. బొమ్మ చూడగానే తెల్సిపోయిందనుకుంటా. య్యస్. డాల్ఫిన్ అనగానే టీవీలో, సినిమాలో చూసిన వాటి విన్యాసాలే గుర్తుకొస్తాయికదా! మరి ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందామా?

- డాల్ఫిన్ శాస్త్రీయనామం: లాజెనోరింకస్ ఓబ్లిక్విడెన్స్
- ఇవి ఎక్కువగా సముద్రాల్లో తీరం నుంచి 125 మైళ్ల దూరంలో ఉంటాయి. వాటి వీపు నల్లగా, పక్కలేమో బూడిద రంగులోనూ, పొట్ట తెల్లగానూ ఉంటుంది. వీపుపై శరీరం పొడవునా బూడిద రంగులో రెండు గీతలు ఉంటాయి. దాని వెనుక భాగం వంపు తిరిగి ఉంటుంది. అది ముడుచుకోకుండా నిటారుగా ఉంటే 2.5 మీటర్ల పొడవుంటుంది. దాని బరువు 180 కిలోగ్రాములుంటుందట. దక్షిణ ఫసిఫిక్ తీరప్రాంతాన ఉన్న కొలంబియాలో తెల్లని డాల్ఫిన్లుంటాయి.
- ఇవి మాంసాహారులు. కాడ్ చేపలు, లాటర్న్ చేపలు వంటి రకరకాల సముద్రచేపలు వాటి ఆహారం.

- ఇవి చక్కగా కలిసిమెలిసి ఉంటాయి. ఎక్కడికి వెళ్లినా గుంపులుగా గుంపులుగా వెళ్తాయి. ఒక్కో గుంపులో 20 నుండి వందల డాల్ఫిన్లు ఉంటాయి. ఒక్కోసారి ఈ గుంపులు వేలల్లో కూడా ఉంటాయి. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ గుంపులు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి తమ జాతి డాల్ఫిన్లతోనే కాదు ఇతర జాతి డాల్ఫిన్లతోనూ, తిమింగలాలతోనూ, సీల్స్‌తోనూ, సముద్రపు సింహాలతోనూ స్నేహం చేస్తాయి, ఆడుకుంటాయి తెలుసా? అప్పుడే పుట్టిన పిల్లలు కూడా మూడు అడుగులుంటాయి. ఇవి ఎక్కువగా ఎండాకాలంలోగానీ, చలికాలం ప్రారంభంలోగానీ పుడతాయి.
- డాల్ఫిన్లు మాట్లాడుకుంటాయి కూడా! ఎలా అంటారా? రకరకాల అరుపులు, ఈలల ద్వారా. ఏదైనా ప్రమాదం రాబోతుంటే ఈ శబ్దాల ద్వారా ఒక దానికొకటి చెప్పుకుంటాయి.

పాప ఎక్కడ?

ఇక్కడే ఎక్కడో పాప వుండాలి! మీకుగానీ కనిపించిందా? లేదా? పులి మాత్రమే కనిపిస్తోందా? బాగా పరిశీలనగా చూడండి. పాప కూడా ఇక్కడే ఎక్కడో కనిపిస్తుంది. ఒకవేళ కనిపించిందో వాళ్ల అమ్మమ్మకు అప్పచెప్దాం. సరేనా!

జవాబు: పులి ఎడమ కంటి దగ్గరే పాప కన్ను కూడా వుంది. ఇప్పుడు పాప కనిపించిందా?!

రంగులు పులిమేద్దాం

అబ్బా! పిల్లి ఎంత ఆనందంగా వుందో కదా.
మరి ఇష్టమైన ఆహారం దొరికింది.
మీరేం చేస్తారంటే రంగులు అద్దేసి
దాన్ని మరింత సంతోష పెట్టండే!

దారి కనిపెట్టండి



బుజ్జాయిలూ... ఇక్కడ ఫొటోలో మీలాంటి బాబు ఒకడు వున్నాడు కదా.
ఆ బాబు మొక్కలకు నీళ్లు పోయడానికి వచ్చాడు.
కాకపోతే బోలెడన్ని గజిబిజి దారులు కనిపించాయి.
ఇంతకీ ఏదారిలో వెళితే మొక్కలకు నీళ్లు పోయగలడు?
మరి కాస్త సాయం చేయాలోయ్ మీరు.

తప్పులేంటి?

హాయ్! ఈ బొమ్మలో రెండు తప్పులున్నాయి. కావాలనే ఆర్టిస్టు అంకుల్ అలా చేశారు. మరి అవేంటో కనిపెట్టి చెప్పాల్సింది మీరే. తెలీకపోతే మాత్రం మా జవాబుతో పోల్చుకోండే.

జవాబు: 1. విండ్ మిల్ రెక్కలు మరీ పెద్దగా వున్నాయి. 2. రెక్కలమీద మెట్లు వున్నాయి.

◆ కొత్త పుస్తకాలు

కాలం మారింది

కవి తన శ్రీమతి సాధు హైమవతికి ఈ కవితా సంపుటి అంకితం చేశారు. దాదాపు 22 కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి. సాధు వాడి మాట-నవ సహస్రాబ్ది బాట, కాలవాహిని, ఒంకోలా (నవల), సాధు బాలశిక్ష, ది హ్యూమన్ మేనిఫెస్టో, మేటి భారతం లాంటి గ్రంథాలు రాసిన శర్మ గారు ఎనభై రెండేళ్ల వయస్సులో కూడా సమాజాన్ని, యువతను చైతన్య పరిచే దిశగా కాలాన్ని కలాన్ని సద్వినియోగం చేయడం ప్రశంసనీయం. 1857-1947 స్వాతంత్ర్య సమరాన్ని 'హిస్టరీ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్'గా రాయడం కూడా అభినందనీయం.

వ్యవస్థ లోపాన్ని వ్యవస్థ ద్వారానే మార్చగలం - వ్యూహాత్మకంగా జరిగే లోపాలను వ్యూహాత్మకంగా సరిదిద్దగలం అంటారు ఈ కవి.

వీరి కవితల్లో కొన్నింటిని మచ్చుకు చూద్దాం.

'భుజాలెక్కి చూద్దాం' అనే కవితలో (పేజి-13) ఒక చోట ఇలా అంటారు.

'న్యూటన్, ఐన్‌స్టీన్‌లు అన్నట్లు / దిగ్గజాల భుజాలెక్కి

వారు చూడని దూరాలు /

మనం చూసి మన జనులకు /

త్రోవ చూపేది గొప్ప!'

గొప్ప వారిని ఆదర్శంగా స్వీకరించి... ఆ బాటలో నడిచి.. ఇతరులకు మార్గదర్శకులు కావాలి అనే వీరి కవిత భావన ప్రశంసనీయం.

అవినీతికి దూరంగా వుండాలి అనే భావన 'పూజ' అనే కవితలో (పేజి-17) ఇలా రాశారు.

'జీవన వృత్తిలో అవినీతి / మాని నీతి మంతుడైతే /

దానికే పూజలు సమానం?

మానవుల సేవయే / మాధవుని సేవయని

ఆ పన్నుల బ్రోచుట / పరమోత్కృష్ట పూజ

(పేజి-20) అంటారు కవి.

'మనకిప్పుడు కావాల్సింది సైన్సు! భక్తి చాలు' (పేజి.21) అనే దీర్ఘకవిత ఆలోజింప చేస్తుంది. నిఖార్సభ్యుదయం తేటిపారం, వేట, వికారి, ఈత, పూర్వీకులను దాటిపోదాం.. అనే కవితలు స్వీయానుభవ సారంతో రాసిన అక్షర అనుభూతులు.. గ్లోబల్ శక్తుల వ్యతిరేకత... అభినందనీయం.



కాలం మారింది
రచన : సాధు సుబ్రహ్మణ్యం శర్మ,
వెల : 50/-, పేజీలు : 81,
ప్రతులకు : కవి పేరుతో, 69-3-4ఎఫ్, ఐ.కె.రోడ్‌లైన్ కె. రాజేంద్రనగర్, కాకినాడ - 533003.

నమ్మకాలు వమ్మవుతున్న చోట

ఈ కవితా సంపుటిలో 53 కవితలున్నాయి. చాలా కవితలు మానవత్వాన్ని, మానవతా వాదాన్ని ప్రతిబింబిస్తాయి. సామాన్యుల గురించి కవిత్వీకరించి చెప్పడం అభినందనీయం. సద్దామ్ ఉరితీతపై స్పందిస్తూ అమెరికా ఉగ్రవాదాన్ని వేలెత్తి చూపుతాడు. పుస్తకాన్ని నేను, టాప్ ర్యాంకర్, బాబు పనోడు, బొగ్గు పెల్ల, భూమ్మీద నడూ, వెలుగు కాశాక లాంటి కవితలు కవిలోని మానవతా దృక్పథాన్ని మట్టి పరిమళాల సువాసనల్ని ఆస్వాదించవచ్చు. వీరి కవిత్వం నుండి కొన్ని కవితలు పరిశీలిద్దాం.

'స్ఫూర్తినిచ్చే స్థూపం భూమన్న' అనే కవితలో (పేజి-110) జ్ఞాన స్పర్శను/వర్గ స్పృహను పొందింది మొదలు / అమరత్వం చెందేందుకా / ఆగింది లేదు/ అలసట గొన్నదీ లేదు.

ప్రజల కోసం విలువైన జీవితాన్ని త్యాగం చేసే వారు నిత్య స్ఫూర్తి ప్రదాతలే గదా: భూమన్నంటే/రేపటి తెలంగాణాను/చూపెట్టిన వేలు/సామాజిక విత్తనాలేసిన నాగటిసాలు' అంటారు కవి.

ఏ కవికైనా అంతర్జాతీయ, రాజకీయ, భౌగోళిక అవగాహన చాలా అవసరం. 'సద్దామ్‌కు ఉరేయమంటే' (పేజి.80) అనే కవితలో అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ప్రశ్నిస్తూ ఓ చోట కవి ఇలా అంటాడు. 'అపనిందలేసి/యుద్ధాలకు త్రోవ తీసి/సర్వం భస్మీపటలం చేసి/వెన్నెముక లేనోళ్లను/అధిపతుల్ని చేసి/దేశాలకు దేశాల్ని ఇరాక్‌లుగా మారుస్తుంటాడు/వాళ్ళ వేళ్ళతో వాళ్ళ కళ్ళనే పొడుస్తుంటాడు.

'శతమానం భవతి' కవిత ఆత్మహత్యలపై రాసినది. తొందరపడి/గందరగోళంలో పడి/

బ్రతుకునెందుకు విషమం చేసుకుంటారు?

బ్రతకడం, బ్రతుకునివ్వడం కన్న గొప్ప కార్యం మరేముందంటారు? అంటాడు కవి (పేజి.34) అలాగే గని కార్మికులపై, ఓల్డ్ ఏజ్ హోములపై, భార్యపై (పాలవెల్లి) కవితలు... చేతివృత్తులపై, రైతులపై రాసిన కవితలు.. శిల్ప నైపుణ్యాన్ని, వస్తు సాంద్రతను తెలియజేస్తాయి.



నమ్మకాలు వమ్మవుతున్న చోట
రచన : ఏలేశ్వరం వెంకటేశ్,
పేజీలు : 112, వెల : 100/-,
ప్రతులకు : ఎ.శ్రీదేవి, 19-7-21/1, లక్ష్మీనగర్, గోదావరి ఖని-505209,
సెల్ : 9849487146,

- ప్రసన్న కుమారి

న్యూమోల్
లాటిన్ అమెరికా వామపక్ష మార్గం
రచన : ఎమిర్ సాదెర్
పేజీలు : 176, వెల : 80/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ (తెలంగాణ)



అధ్యయనం ఆచరణ
రచన : తమ్మినేని వీరభద్రం
పేజీలు : 144, వెల : 70/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ (తెలంగాణ) ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20, ఫోన్ : 040-27669913.
బ్రాంచీలు : హైదరాబాద్-చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్, నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు.

లిటిల్‌స్టార్ జవాబు : జూనియర్ ఎన్టీఆర్

కాంక్రీటు ఆర్టు

పల్లెల్లో పచ్చదనం చూసి ముగ్ధులమౌతాం. అలాగే పట్టణాల్లో ఆకాశహర్మ్యాలను చూసి ఆశ్చర్యపోతాం. పట్టణాలు కావాలి. పచ్చదనమూ కావాలి. అంటే కుదిరే పనేనా! అవ్వా బువ్వా రెండూ కావాలి అన్నట్టే వుంటుంది. అందమైన భవనాలు పచ్చటి చెట్లను హాంఫట్ చేసేస్తాయ్. ఇంక దానికి రెండో మార్గమే లేదు. అయితే కళాకారులు ఊరుకుంటారా! ఏ చిన్ని అవకాశాన్నీ విడిచిపెట్టరు కదా. ఎక్కడ కూసింత పచ్చదనం కన్పించినా... ఇదిగో ఇలా కళాఖండాలను సృజించేసి... సందర్శకులను కళాదాసులను చేసేస్తున్నారు. అయినా కళా హృదయం వుంటే... స్పందించే మనస్సుంటే... కారా ఎవరైనా ఫిదా! ◆





సొర హంసలు

చైనా వాలా లియు జియాంఘు గొప్ప కళాకారుడు. ఎంత గొప్ప అంటే... పెరటి సొరకాయలతో గుమ్మడి
కాయలు మొదలుకొని అందమైన హంసలను సృజించగలిగేంత. చూశారుగా! లియు చేతిలో
పొడవా....టి మెడ కలిగిన గుమ్మడికాయ లాంటి సొరకాయలను! వాటిని సృజించాలంటే మామూలు
విషయమా! అంకితభావం, ఆసక్తి ఏ స్థాయిలో వుంటే అది సాధ్యమో ఆలోచించండి. అందుకోసం
అతను కేవలం తన చేతులను, ప్లాస్టిక్ తాళ్లను మాత్రమే ఉపయోగిస్తాడు. కాయలు తను అనుకున్న
ఆకారంలో పెరుగుతున్నాయో లేదోనని ప్రతి రోజూ పరిశీలిస్తాడు. మధ్యాహ్నం మూడు గంటల
సమయంలో వాతావరణంలోని ఉష్ణోగ్రతకు కాయలు మెత్తగా అవుతాయి. అప్పడు వాటిని తను
అనుకున్న పద్ధతుల్లో మెలి పెట్టి ముడి వేయడం, తాళ్లు కట్టి ఆకారాలను మలచడం చేస్తుంటాడు.
నిజానికి ఇదంతా తన బాల్యంలో దూరపు బంధువు ఒకాయన చూపించాడు. బూరలతో జంతువుల
బొమ్మలు చేసినట్టే సొరకాయలతో రకరకాల ఆకారాలు చేసేవాడు. దాంతో చిన్నారి లియు అల్లరి
మాని బుద్ధిగా వుండేవాడు. ఆ తర్వాత ఆ విషయాన్నే మర్చిపోయాడు. 1994 తర్వాత ఓ స్నేహితుడు
జంతువుల ఆకారాల్లో సొరకాయలను పండించడం ఎలాగో తెలియచెప్పే పుస్తకాన్ని చూపించినప్పడు
ఆ విషయం గుర్తొచ్చింది. ఇంకేం మొదలెట్టేశాడు. ఆ పనిలో వుంటే ఎంత సమయం గడిచిపోతోందో
కూడా గుర్తు రాదు. అలా గంటల తరబడి పొలంలోనే వుండిపోతాడు లియు. గుమ్మడికాయలు,
హంసలు...వంటి ఆకారాలను పోలిన సొరకాయలను ఎండబెట్టి తోలు వలిచి రంగులు వేసి... అమ్మకానికి
పెడతాడు. కళాహృదయులు వాటిని ఎంతో ఇష్టంగా ప్రేమగా కొనుక్కెళ్తుంటారు. సో ... క్యూట్ కదా!
◆